ఉష్ణోగ్రత శుక్రవారం గరిష్ఠం : 29.0 కనిష్ఠం : 23.0

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



అనంతపురం

జిల్లా వార్తలు

శనివారం 27 సెప్టెంబరు 2025

ఏమిటీ దుర్గతి..?

కార్పొరేషన్ పారిశుధ్య విభాగం అస్తవ్యస్తం

- అర్హత లేనివారు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు!
- డాక్టర్లు కానివారు ఎంహెచ్‌ఓలు
- ఇష్టారాజ్యంగా కార్మికుల విధుల నిర్వహణ
- ఎవరు ఎక్కడ పని చేస్తున్నారో తెలియని వైనం
- గత ప్రభుత్వ తీరుతోనే అధ్వానమైన స్థితి



ఎన్టీఆర్ మార్గ్‌లో డ్రైనేజీలో ప్లాస్టిక్ వ్యర్థాలు



నాలుగోరోడ్డులో నగరపాలక ప్రాథమికోన్నత పాఠశాల వద్ద మురుగుకాలువ దుస్థితి

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ పాలనాతీరుతో నగరంలో పారిశుధ్య విభాగం భ్రష్టు పట్టింది. డాక్టర్ కోర్సు చదవని వారిని ఎంహెచ్‌ఓలుగా నియమించి, ఏఎంసీ(అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్)లో పారిశుధ్య విభాగాన్ని నిర్వీర్యం చేశారు. కనీస విద్యార్హత లేని సీనియర్ వర్కర్లను శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లుగా నియమించి గందరగోళం సృష్టించారు. ఇలా గత వైసీపీ ప్రభుత్వం చేసిన తప్పిదాలతో ప్రస్తుతం నగరంలో పారిశుధ్యం నిర్వహణ అధ్వానంగా మారింది. ఇంటింటి చెత్త సేకరణ, ప్రతి నిత్యం మురుగు కాలువల్లో పూడిక తీయడంలో పూర్తి నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు.

ఏఎంసీలో పారిశుధ్య విభాగం కీలకం. నగరంలో పరిసరాలు శుభ్రంగా, ఆహ్లాదకరంగా ఉండాలంటే పారిశుధ్య నిర్వహణ మెరుగ్గా ఉండాలి. అలాంటి కీలక విభాగం పర్యవేక్షణకు డాక్టర్‌నే నియమించాలి. ఈయన కూడా శానిటేషన్‌లో ఏడాది డిప్లొమా కోర్సు చదివి ఉండాలి. కానీ వైసీపీ పాలనలో మూడేళ్ల పాటు డాక్టర్ కోర్సు చదవని, డీఆర్‌డీఏలో మేనేజర్ స్థాయిలో ఉన్న సంగం శ్రీనివాసులును ఎంహెచ్‌ఓగా కొనసాగించారు. ఆయనకు అవగాహన లేకపోవడంతో ఏఎంసీలోని శానిటేషన్ వ్యవస్థ నిర్వీర్యం అయ్యింది. ప్రస్తుతం ప్రభుత్వంలోనూ అదే పరిస్థితే కొనసాగుతోంది. డాక్టర్‌ను ఎందుకు నియమించాలంటే ప్రతి నిత్యం విధుల్లో ఉండే పారిశుధ్య కార్మికులకు రెండు మూడు రోజుకు ఒక సారి హెల్త్ చెకప్ చేయాల్సి ఉంటుంది. బదిలీ వర్కర్లను నియమించుకోవడానికి కనీసం 40శాతం ఆరోగ్యం క్షీణించి ఉండాలి. ఇవన్నీ పరిశీలించడం ఒక డాక్టర్‌కే సాధ్యమవుతాయి కనుక ఎంహెచ్‌ఓగా డాక్టర్‌నే నియమించాలనేది ప్రభుత్వ నిబంధన.

డాక్టర్ చదవని వారు ఎంహెచ్‌ఓలు..

ఏఎంసీ సెక్రటరీకి అదనంగా ఎంహెచ్‌ఓ బాధ్యత అప్పగించడంతో పనిభారంగా భావిస్తున్నారు. ఇక అవగాహన బాధ్యత లేని శానిటరీ ఇన్‌స్పెక్టర్లు క్షేత్రస్థాయిలోకి వెళ్లకపోవడం, అసలు ఎవరూ పనిచేస్తున్నారో...ఎవరు చేయడం లేదనే కనీస పర్యవేక్షణ కొరవడటంతో నగరంలో పారిశుధ్యం పడకేసింది.

జీఓను పక్కనపెట్టిన వైసీపీ

గత వైసీపీ ప్రభుత్వ నిర్వాకంతోనే నగరంలో పారిశుధ్యం దారుణంగా మారినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. 2015లో అప్పటి టీడీపీ ప్రభుత్వం జారీ చేసిన జీఓ నంబరు 279ప్రకారం ప్రతిరోజు ఒక్కో శానిటరీ వర్కర్ కనీసం 300ఇళ్ల నుంచి చెత్త సేకరించాలి. అయితే 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ఈ జీఓను పక్కనపెట్టింది. దీంతో రెండు, మూడు రోజులకు ఒకసారి కూడా కనీసం వంద ఇళ్ల నుంచి చెత్త సేకరించలేదు. ప్రతిరోజూ ఉదయం ఇంటింటి చెత్తసేకరణ చేపట్టి, మధ్యాహ్నం డ్రైనేజీ కాలువలు శుభ్రం చేయాలి. అయితే అధికారుల అలసత్వం, ప్రజాప్రతినిధులు చొరవ చూపకపోవడం, యూనియన్ల ప్రభావంతో ఇది అమలు కావడం లేదు. దీంతో నగరంలో పారిశుధ్యం నిర్వహణ అధ్వానంగా మారింది.

బదిలీల ముసుగులో...

నగరపాలక సంస్థ పరిధిలో పారిశుధ్య విభాగంలో పనిచేస్తున్న రెగ్యులర్ వర్కర్లు బదిలీ వర్కర్ల పేరుతో విధులకు డుమ్మా కొడుతున్నారు. బదిలీ వర్కర్ల నియమకానికి ఎంహెచ్‌ఓ ద్వారా కమిషనర్ అనుమతి పొందాలి. అయితే ఏఎంసీలో మాత్రం శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు అందినకాడికి పుచ్చుకుని ఇష్టానుసారంగా బదిలీ వర్కర్లను నియమిస్తున్నారు. సాధారణంగా పురుష కార్మికులు చేయాల్సిన పనికి బదిలీ మహిళా వర్కర్లను నియమించడంతో ఎక్కడ పని అక్కడే ఆగిపోతోంది. పురుషులు చేయాల్సిన డ్రైనేజీ కాలువ క్లీనింగ్ పనిని మహిళలు చేయలేరు. బదిలీ వర్కర్లను నియమించకనే రెగ్యులర్ వర్కర్లు విధులకు డుమ్మా కొడుతూ ప్రతి నెలా జీతాలు మాత్రం డ్రా చేస్తున్నారు. ఆరో సర్కిల్‌లో ఓ రెగ్యులర్ వర్కర్ గత ఆరు నెలలుగా విధులకు హాజరుకాకుండా, బదిలీ వర్కర్‌ను నియమించకుండా యథేచ్ఛగా తిరుగుతూ జీతం డ్రా చేస్తున్నారు. ఇదే తరహా మూడో సర్కిల్‌లోనూ కొనసాగుతోంది. ఇవి మచ్చుకు మాత్రమే. ఇలాంటి ఇంకా చాలా ఉన్నట్లు సమాచారం. ఈ విషయాలు అధికారులకు తెలియవా.. అంటే కచ్చితంగా తెలుసు. అవగాహనా ఒప్పందాలు, వాటాలతో అన్ని సద్దుమణిగిస్తున్నట్లు సమాచారం.

అర్హత లేకున్నా శానిటరీ ఇన్‌స్పెక్టర్లుగా..

అనంత నగరపాలక సంస్థ శానిటేషన్ సెక్షన్‌లో ఆరు సర్కిళ్లు ఉన్నాయి. శానిటరీ ఇన్‌స్పెక్టర్ పోస్టుకు కనీసం సైన్సులో డిగ్రీ చదివి ఉండాలి. ఇందులో ఐదో సర్కిల్‌లో పనిచేస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు మాత్రమే రెగ్యులర్, విద్యార్హతలు ఉన్నాయి. ఇక మిగిలిన ఐదు సర్కిళ్లలో పనిచేస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్లు అంతా సీనియర్ వర్కర్లు. వీరికి ఎటువంటి విద్యార్హత లేదు. గత వైసీపీ ప్రభుత్వంలో ఉద్యోగి మరణించడంతో కొడుకుకు ఉద్యోగం ఇచ్చి, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా నియమించారు. కరోనా సమయంలో 75మంది మేల్ వర్కర్లను అత్యవసరంగా నియమించారు. ఆ జాబితాలో ఆ శానిటరీ ఇన్‌స్పెక్టర్ అప్పటి అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, అధికారుల అండతో తన రెండో భార్య పేరును 75మంది మేల్ (పురుషుల) జాబితాలో ఎక్కించారు. దీన్ని గమనించిన గత కమిషనర్ భాగ్యలక్ష్మి వెంటనే ఆమెను విధుల నుంచి తొలగించారు. ఇటీవల సర్కిల్లో పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా ఉందని ఆ శానిటేషన్ ఇన్‌స్పెక్టర్‌కు ఏఎంసీ కమిషనర్ షోకాజ్ నోటీసులు కూడా జారీ చేసి హెచ్చరించారు. అయితే ఆ శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లో మాత్రం మార్పు రాలేదు.

నిర్లక్ష్యం వాస్తవమే



ఏఎంసీ శానిటేషన్ విభాగంలో కొంత నిర్లక్ష్యం ఉన్న మాట వాస్తవమే. అయితే నిత్యం హెచ్చరిస్తూ అటు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ఇటు కార్మికులకు సూచనలు చేస్తూ పని చేయించుకోవాలి. లేదంటే నగరంలో దుర్గంధం, చెత్త, మురుగు కాలవలు మరింత అధ్వాన పరిస్థితికి చేరుతాయి. విషయాన్ని ఇప్పటికే కమిషనర్ దృష్టికి కూడా తీసుకెళ్లాం. స్పెషల్ డ్రైవ్ ద్వారా ఎప్పటికప్పుడు డ్రైనేజీ క్లీన్ చేయాలని సూచిస్తున్నాం. ఇంటింటి చెత్త సేకరణపై ప్రజలలో కొంత అసంతృప్తి ఉన్న మాట వాస్తవమే. ప్రతిరోజూ కమిషనర్‌తో పాటు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ఎక్కడెక్కడ నిర్లక్ష్యం, నిర్వహణ లోపం ఉందో గమనించి మెరుగుపరాలని హెచ్చరిస్తున్నాం.

-రంగస్వామి, అనంత నగరపాలక సంస్థ ఎంహెచ్‌ఓ

పాఠశాలలకు పూర్తిస్థాయిలో

బియ్యం ఇవ్వాలి

అసెంబ్లీలో రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత విజ్ఞప్తి



అనంతపురం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో అవసరం మేరకు పూర్తిస్థాయిలో సన్న బియ్యం సరఫరా చేయాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత.. రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం అసెంబ్లీలో ఆమె మాట్లాడుతూ... ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్ ప్రభుత్వ పాఠశాలల్లో సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం అందిస్తామని చెప్పారన్నారు. హామీ అమలు చేస్తున్నందుకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానన్నారు. గత ప్రభుత్వ హయాంలో బియ్యం సరిగాలేక పిల్లలు మధ్యాహ్న భోజనం తినేందుకు ఇష్టపడేవారు కాదన్నారు. చాలామంది ఇళ్ల నుంచి భోజనం తెచ్చుకునేవారన్నారు. ప్రస్తుతం సన్నబియ్యం సరఫరా చేయడం మూలంగా భోజనం చాలా రుచిగా ఉందన్నారు. అందుకే పిల్లలు పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం తినేందుకు ఆసక్తి చూపుతున్నారన్నారు. పిల్లలు గతం కంటే ఎక్కువ మంది భోజనం చేస్తున్నందున పాఠశాలలకు అందించే సన్న బియ్యం సరిపోవడం లేదన్నారు. ఇటీవల పాఠశాలలను సందర్శించినపుడు ఉపాధ్యాయులు సమస్యను తన దృష్టికి తెచ్చారన్నారు. ఈ నేపథ్యంలో... పాఠశాలల్లో అవసరం మేరకు పూర్తిస్థాయిలో సన్నబియ్యం సరఫరా చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వ హయాంలో పాఠశాలల్లో నాడు-నేడు పేరుతో చేపట్టిన పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయన్నారు. మొండిగోడలు, తలుపులులేని పాఠశాలలు పిల్లలకు అసౌకర్యంగా ఉన్నాయన్నారు. రాప్తాడు నియోజకవర్గంలో కొన్ని వసతిగృహాలు, కేజీబీవీ, ఎంజేపీ పాఠశాలల్లో అదనంగా నిర్మాణాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. పాఠశాలలు, ప్రభుత్వ హాస్టళ్లలో పెండింగ్ ఉన్న పనులకు నిధులు మంజూరు చేయాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పరిటాల సునీత.. ప్రభుత్వాన్ని కోరారు.

అండర్‌గ్రౌండ్ డ్రైనేజీకి ఆమోదం తెలపండి

అసెంబ్లీలో అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్



అనంతపురం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): నగరంలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు త్వరితగతిన ప్రభుత్వం ఆమోదం తెలపాలని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్.. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారాయణకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం అసెంబ్లీ సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ... అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో 50 డివిజన్లు, 4 పంచాయతీలుఉన్నాయన్నారు. జనాభా 5 లక్షలు దాటిందన్నారు. ఈ క్రమంలో డ్రైనేజీ సమస్య పెరిగిపోయిందన్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం అండర్ గ్రౌండ్ డ్రైనేజీ చాలా అవసరమన్నారు. 2024 ఎన్నికలకు ముందు నియోజకవర్గ ప్రజలకు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ హామీ ఇచ్చిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. గతేడాది అక్టోబరు 17న మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ, డిసెంబరు 30న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కలిసిన సందర్భంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సమస్యను వారి దృష్టికి తీసుకెళ్లానన్నారు. ఇప్పటికే డీపీఆర్‌ను సైతం అందజేశామన్నారు. ప్రభుత్వం అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు ప్రారంభించుకునేందుకు అవసరమైన నిధులు మంజూరు చేస్తూ... ఆమోదం తెలిపాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

వైసీపీ, టీడీపీ దోస్తీ..!

అక్రమ లే అవుట్‌లో భాగాలు

అనుమతులు తీసుకోవాలన్న అధికారిపై చిందులు



రాచానపల్లి పరిధి సర్వే నంబరు 49లో వేసిన అనధికార లేఅవుట్

అనంతపురం రూరల్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): టీడీపీ, వైసీపీ నేతలు మిలాఖత్ అయ్యారు. వైసీపీ నాయకులు అక్రమంగా లేఅవుట్ వేస్తే.. టీడీపీ నేతలు అండగా నిలుస్తున్నారు. మండలంలోని రాచానపల్లి వద్ద వెలసిన ఓ అక్రమ లేఫుట్ ఇందుకు నిలువెత్తు సాక్ష్యంగా నిలుస్తోంది. గ్రామ సమీపాన ఎకరా భూమిలో వైసీపీకి చెందిన ఇద్దరు నాయకులు అనధికార లేఅవుట్ వేశారు. అధికారులు, ఇతరత్రా వర్గాలతో సమస్యలొస్తాయని అనుకున్నారో.. ఏమోగానీ లే అవుట్‌లో అధికార పార్టీ నాయకులను భాగస్వాములను చేసుకున్నారు. వారికీ భాగం ఇచ్చారు. ఇంకేముంది ఎవరన్నా ప్రశ్నిస్తే.. అధికార పార్టీ నాయకులను ముందు పెట్టి వ్యాపారం ఎంచక్కా చేసుకుంటున్నారు.

ప్రశ్నించిన అధికారిపై చిందులు..

రాచానపల్లి సర్వే నంబరు 49లోని ఎకరా భూమిలో వైసీపీ, టీడీపీ నాయకుల కలయికలో అక్రమ లేఅవుట్ వెలసింది. లేఅవుట్ వేయాలంటే అహుడా అనుమతులు తీసుకోవాలి. పంచాయతీకి స్థలం కేటాయించాల్సి ఉంది. భూమిని ల్యాండ్ కన్వర్షన్ చేయాలి. ఇవేవీ లేకుండానే నాయకులు లేఅవుట్ వేసేశారు. భూమిని చదును చేసి, ప్లాట్లుగా విభజించి, అమ్మకాలు మొదలుపెట్టారు. విషయం తెలిసిన సదరు పంచాయతీ అధికారి వారిని ప్రశ్నించినట్లు తెలుస్తోంది. అహుడా అమతులు తీసుకోవాలని సూచించారు. ఇందుకు సదరు నాయకులు స్వరం పెంచి బెదిరింపు ధోరణిలో మాట్లాడినట్లు తెలుస్తోంది. అధికార పార్టీ నాయకులమైన తాము కూడా అనుమతులు తీసుకోవాలా అంటూ అధికారిపై గట్టిగానే చిందులేసినట్లు ఆయావర్గాల్లో చర్చ సాగుతోంది. తమ ప్రజాప్రతినిధులకు తెలిసే లేఅవుట్ వేశామనీ, ఎవరితో చెప్పుకుంటారో చెప్పుకోండంటూ మాట్లాడినట్లు ఆ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ప్రజాప్రతినిధుల పేరు చెప్పడంతో అధికారి సైతం మిన్నకుండిపోయినట్లు తెలుస్తోంది. అలా.. వైసీపీ నాయకులు వెనకుండి.. టీడీపీ నేతలను ముందు పెట్టి వ్యాపారానికి అడ్డంకులు లేకుండా చేసుకుపోతున్నారు.

అహుడా అనుమతులు తీసుకోవాలని చెప్పాం

రాచానపల్లి సర్వే నంబరు 49లో వేసిన లేఅవుట్ విషయం మా దృష్టికి వచ్చింది. పంచాయతీ, అహుడా అనుమతులు లేవు. లేవుట్ వేసినవారికి అనుమతులు తీసుకోవాలని సూచించాం. నోటీసులు కూడా జారీ చేస్తాం.

- మహమ్మద్ రఫీ, పంచాయతీ కార్యదర్శి

అభ్యర్థులకు పరీక్ష..!

- ఎస్కేయూ అధికారుల ఇష్టారాజ్యం
- చెప్పాపెట్టకుండా పరీక్ష కేంద్రం మార్పు
- పరుగులు తీసిన బీఈడీ దూరవిద్య అభ్యర్థులు
- ఇద్దరు బాలింతలు అడిగినందుకు మార్చారట..!



ఒకరి వెనుక ఒకరు కూర్చుని పరీక్ష రాస్తున్న దృశ్యం

అనంతపురం రూరల్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఎస్కేయూలో పరీక్షల నిర్వహణ గందరగోళంగా మారుతోంది. కొందరు అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండటంతో అభ్యర్థులు నష్టపోతున్నారు. ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు శుక్రవారం నిర్వహించిన బీఈడీ దూరవిద్య పరీక్షలలో ఇలాంటి వ్యవహారమే చోటు చేసుకుంది. ఎస్కేయూ బీఈడీ కళాశాలలో పరీక్షలు నిర్వహిస్తామని హాల్ టిక్కెట్‌లలో పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణకు కళాశాల అధికారులు, సిబ్బంది ఏర్పాట్లు చేశారు. కానీ ఎవరికీ సమాచారం ఇవ్వకుండా వర్సిటీ అధికారులు పరీక్ష కేంద్రాన్ని రెండు ప్రాంతాలకు మార్చారు. మార్పు

(మిగతా 7లో..)



జడ్పీ కార్యాలయంలో ఎంపీటీసీలు

ఎంపీపీ సునీతకు

పదవీ గండం

అవిశ్వాసం దిశగా వైసీపీ ఎంపీటీసీల అడుగులు

7

ప్రతి విద్యార్థి ఉద్యోగాలు సృష్టించాలి: వీసీ

పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేలా చర్యలు: కలెక్టర్

బెజవాడ కనకదుర్గమ్మ

ఆలయ కమిటీ సభ్యురాలిగా లక్ష్మీదేవి



జింకా లక్ష్మీదేవి

తాడిపత్రి, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): బెజవాడ కనకదుర్గమ్మ ఆలయ కమిటీ సభ్యురాలిగా తాడిపత్రి మున్సిపాలిటీ 36వ వార్డు కౌన్సిలర్ జింకా లక్ష్మీదేవిని ప్రభుత్వం నియమించింది. టీడీపీని నమ్ముకున్న తనలాంటి కార్యకర్తకూ పదవులు దక్కడం ఆనందంగా ఉందని లక్ష్మీదేవి అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, ఎమ్మెల్యే జేసీ అశ్మిత్ రెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

నేడు పీఆర్ ఈఎన్‌సీ రాక

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): పంచాయతీ రాజ్ ఈఎన్‌సీ బాలునాయక్ శనివారం జిల్లాకు వస్తున్నారు. ఆయన శనివారం ఉదయం 9 గంటలకు అనంతపురం చేరుకుంటారు. పీఆర్ ఎస్‌ఈ కార్యాలయానికి పది గంటలకు చేరుకుని, సిబ్బందితో సమావేశం నిర్వహిస్తారు. అనంతరం క్షేత్రస్థాయి పర్యటనకు వెళతారు. జిల్లాలో పీఐయూకు సంబంధించి సుమారు పదేళ్లకు పైబడి ప్రారంభించని పనులు ఉన్నాయి. పామిడి మండలం కత్రిమల వద్ద బ్రిడ్జి నిర్మాణం ముందుకు సాగడం లేదు. ఆక్రమణల కారణంగా పనులు చేపట్టలేని పరిస్థితి ఎర్పడింది. ఇలాంటి సమస్యలన్నీ ఈఎన్‌సీ పర్యటనతో పరిష్కారమౌతాయని అధికారులు భావిస్తున్నారు.

నెట్టికంటికి

రూ.2.25 కోట్లు

రాతి ముఖమండపం నిర్మాణానికి ముందుకొచ్చిన దాతలు



దాతకు స్వామివారి చిత్రపటాన్ని అందజేస్తున్న అధికారులు, అర్చకులు

గుంతకల్లు టౌన్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): కసాపురం శ్రీనెట్టికంటి ఆంజనేయస్వామి దేవాలయంలో స్వామివారి గర్భాలయం, విమాన గోపురం, ముఖమండపం రాతితో నిర్మించేందుకు దాతలు ముందుకొచ్చారు. కర్ణాటకలోని రా యచూరు పట్టణానికి చెందిన నవోదయ విద్యాసంస్థల అధినేత, తెలంగాణ రాష్ట్రంలోని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే రాజేంద్ర రెడ్డి కసాపురం ఆ లయంలో గర్భాలయం, విమాన గోపురం, ముఖమండపాన్ని రాతితో నిర్మించేందుకు రూ.2.25 కోట్లు ఇవ్వనున్నారు. ఈ మేరకు అంగీకార పత్రాన్ని ఆ లయ ఈఓ విజయరాజుకు శుక్రవారం రాయచూరులో అందజేశారు. అనంత రం ఆయనకు వేదపండితులు, అర్చకులు.. స్వామివారి చిత్రపటాన్ని, ప్రసాదాల ను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు రాఘవాచార్యులు, వేదపండితులు సాయికుమార్‌శర్మ, ఏఈఓ వెంకటేశ్వరుడు పాల్గొన్నారు.

ఏసీ బస్సుల్లోనూ

మహిళలకు ఫ్రీ

- ఎండీ ద్వారకా తిరుమలరావు




మాట్లాడుతున్న ఎండీ

తాడిపత్రి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): త్వరలో ఏసీ బస్సుల్లో కూడా మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించేలా ఆలోచన చేస్తున్నట్లు ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు పేర్కొన్నారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌తో పాటు బస్సులను శుక్రవారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ త్వరలో స్త్రీశక్తి పథకానికి ఎలక్ట్రిక్, ఏసీ బస్సులు 1000 అందుబాటులోకి వస్తాయ న్నారు. తిరుపతికి మాత్రమే 300బస్సులు ఇచ్చి మిగతా ప్రాంతాల్లో 50నుంచి వంద బస్సులను ఏర్పాటు చేస్తామన్నారు. వీటిలో కూడా మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించేలా ఆలోచిస్తున్నామన్నారు. రాష్ట్రంలో 129డిపోలు ఉన్నాయి. వాటిలో 60డిపోల్లో వంద శాతం బస్సులను ఏర్పాటు చేస్తున్నామని, ఇబ్బందులు ఉన్నచోట పాత బస్సులను మరమ్మతులు చేయించి అందుబాటులోకి తెస్తామన్నారు. గతంలో మహిళలు 40శాతం, పురుషులు 60శాతం ప్రయాణించేవారన్నారు. ప్రస్తుతం మహిళలు 63శాతం, పురుషులు 37శాతం ప్రయాణిస్తున్నారన్నారు. ప్రతి డిపోలో మరమ్మతుల కోసం నిధులను కేటాయించినట్లు ఆయన తెలిపారు. అన్ని బస్టాండ్లలో తాగునీరు, మరుగుదొడ్లపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ మురళీధర్, అసిస్టెంట్ మేనేజర్ నందిని తదితరులు పాల్గొన్నారు.

అది యాక్సిడెంటే

సతీష్‌రెడ్డి మృతిపై గుంతకల్లు డీఎస్పీ

అనంతపురం క్రైం, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదం వల్లే పామిడి మండలం కొట్టాల గ్రామానికి చెందిన సతీష్‌రెడ్డి మృతి చెందినట్లు గుంతకల్లు ఇన్‌చార్జ్ డీఎస్పీ రవిబాబు పేర్కొన్నారు. అనంతపురం డీఎస్పీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ సతీష్‌రెడ్డి మృతిపై ఎస్పీ జగదీష్ మూడు బృందాలను నియమించి విచారణ చేయించారన్నారు. క్లూస్ టీఎం, డాగ్‌స్క్వాడ్ సాయంతో దర్యాప్తు చేశామని తెలిపారు. ఈ నెల 24న రాత్రి 8.40 గంటలకు ప్రమాదం జరిగిందన్నారు. సీసీ కెమెరాలు పరిశీలించగా ఆ రహదారిలో మూడు వాహనాలు వెళ్లినట్లు గుర్తించామన్నారు. ఆ వాహనాల్లో ట్రాక్టర్ వెనుకవైపు మాత్రమే రక్తపు మరకలు ఉన్నట్లు గుర్తించి దర్యాప్తు ముమ్మరం చేసినట్లు తెలిపారు. ట్రాక్టర్ డ్రైవర్ దేవరపల్లి సాయికుమార్ పామిడి నుంచి గుత్తి మండలం బ్రాహ్మణపల్లికి ఇళ్ల సామగ్రిని లోడ్ చేసుకుని వెళ్తున్నాడన్నారు. అయితే అందులోని కొన్ని సామాన్లు కిందపడిన శబ్దం రావడంతో వెంటనే ట్రాక్టర్‌ను ఆపాడు. వెనుకే వేగంగా ద్విచక్రవాహనంపై వస్తున్న సతీష్ రెడ్డి బైకును నియంత్రించలేక ట్రాక్టర్‌ను ఢీకొట్టాడన్నారు. ఈ క్రమంలో తీవ్రంగా గాయపడి అక్కడే మరణించాడన్నారు. మృతుడు ఆ సమయంలో మద్యం మత్తులో ఉన్నట్లు తెలిపారు. కేసు భయంతో డ్రైవర్ ట్రాక్టర్ సహా పరారైనట్లు తెలిపారు. పోస్టుమార్టం రిపోర్టులో సైతం యాక్సిడెంట్ వల్ల అయిన గాయాలతోనే మరణించినట్లు నిర్ధారణ అయ్యిందని డీఎస్పీ పేర్కొన్నారు. ఈ కేసులో న్యాయపరమైన అభిప్రాయం తీసుకున్న తర్వాతే తదుపరి చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో పలువురు సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ రవిబాబు



వేడుకలలో విద్యార్థుల ఉల్లాసం





ప్రసంగిస్తున్న వీసీ సుదర్శన్‌రావు

ప్రతి విద్యార్థి ఉద్యోగాలు సృష్టించాలి

పరిశోధనలతో జ్ఞానాన్ని పెంచుకోవాలి

జేఎన్‌టీయూఏ వైస్ చాన్స్‌లర్ సుదర్శన్‌రావు

ఘనంగా ఇంజనీరింగ్ విద్యార్థుల ఫ్రెషర్స్ డే

అనంతపురంరూరల్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి ఉద్యోగం కోసం కాకుండా ఉద్యోగాలు సృష్టించే ఆలోచనలతో ముందుకు సాగాలని జేఎన్‌టీయూఏ వీసీ సుదర్శన్ రావు సూచించారు. జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల ఆడిటోరియంలో శుక్రవారం ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ఈ వేడుకలకు జేఎన్‌టీయూఏ వీసీ సుదర్శన్‌రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా రిజిస్ట్రార్ కృష్ణయ్య, కళాశాల ప్రిన్సిపాల్ చెన్నారెడ్డితో కలిసి ఆయన జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం వీసీ మాట్లాడుతూ..జేఎన్‌టీయూ కళాశాలకు 79ఏళ్ల చరిత్ర ఉందన్నారు. ఇందులో చదవడం విద్యార్థులకు వరమన్నారు. ఇక్కడ విద్యార్థుల్లో జూనియర్లు, సీనియర్లు అనే తారతమ్యాలు ఉండవని. అందరూ కలిసి చదువుతున్నారన్నారు. విద్యార్థులకు ఇంజనీరింగ్ చదివే సమయం చాలా విలువైందన్నారు. మంచి నడవడిక, క్రమశిక్షణతో ఎప్పటికప్పుడు కొత్త విషయాల మీద పరిశోధనలు చేస్తూ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. రిజిస్ట్రార్ మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత స్థానానికి చేరుకోవాలన్నారు. ముఖ్యంగా విద్యార్థులు సివిల్ సర్వీసెస్ వైపు దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో యూనివర్సిటీ డైరెక్టర్లు, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వసుంధర, కళాశాల సీనియర్ ఆచార్యులు, విభాగాధిపతులు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

అదరగొట్టిన విద్యార్థులు

ఫ్రెషర్స్ డేను పురస్కరించుకుని విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. విద్యార్థులు ఆటపాటలతో అదరగొట్టారు. తెలుగుదనం ఉట్టిపడేలా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. తమ అభిమాన సినీ నటీనటుల పాటలకు విద్యార్థులు ఉత్సాహంగా డ్యాన్స్ నిర్వహించారు. వారిని ఉత్సాహపరుస్తూ మిగతా విద్యార్థులు ఈలలు, కేకలతో ఆడిటోరియం దద్దరిల్లేలా సందడి చేశారు. ఈ కార్యక్రమాలన్నింటిని ఫొటోలు, వీడియోలు తీస్తూ మరికొందరు కనిపించారు.

అలరించే నృత్య ప్రదర్శన

11వ శతాబ్దపు శాసనం గుర్తింపు

● పాతదేవరపల్లి చెన్నకేశవ ఆలయంలో గుర్తించిన రిటైర్డ్ హెచ్ఎం



పురాతన శాసనాన్ని పరిశీలిస్తున్న రిటైర్డ్ హెచ్ఎం వెంగన్న, గోపి

కొత్తచెరువు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పాతదేవరపల్లి గ్రామ చెన్నకేశవస్వామి ఆలయంలో 11వ శతాబ్దానికి చెందిన శిలా శాసనం గుర్తించినట్లు విశ్రాంతి ప్రధానోపాధ్యాయుడు వెంగన్న, ఉపాధ్యాయుడు గోపి శుక్రవారం తెలిపారు. 11వ శతాబ్దంలో హొయసాల రాజు మొదటి విష్ణువర్దన కాలంలో ఈ ఆలయం నిర్మించినట్లు వారు పేర్కొన్నారు. ఆలయంలో విజయనగర సామ్రాజ్య చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయలు 1511లో రాతిపై లిఖించిన శాసనంతోపాటు మరో నాలుగు శాసనాలు ఉన్నాయన్నారు. ఈ శాసనాలు తెలుగు, కన్నడ భాషల సమ్మిళితంగా ఉన్నాయని వారు తెలిపారు. ఈ ఆలయంలో చెన్నకేశవస్వామి విగ్రహం ప్రతి ఏడాది కొద్దికొద్దిగా పెరుగుతున్నట్లు గుర్తించామని వివరించారు. లక్ష్మీదేవి లింగరూపంలో పూజింపబడటం ఇక్కడి ప్రత్యేకత అని వారు తెలిపారు. ఈ ఆలయ నిర్వహణకు 125 ఎకరాల వ్యవసాయభూమిని రాజులు ఇచ్చారన్నారు. ఆ భూమి ద్వారా వచ్చే ఆదాయాన్ని ఆలయ అభివృద్ధికి ఉపయోగిస్తున్నట్లు పురోహితులు తెలిపారు.



రాయిపై లిఖించిన శాసనం

అభ్యర్థులకు పరీక్ష..!

(5వ పేజీ తరువాయి)

గురించి శుక్రవారం ఉదయం పరోక్ష సమాచారం అందడంతో పరీక్షల విభాగం అధికారులను బీఈడీ కాలేజీ సిబ్బంది సంప్రదించారు. మార్పు ఉండదని వారు చెప్పడంతో మిన్నకుండిపోయారు. ఈ క్రమంలో అభ్యర్థులు పరీక్ష రాసేందుకు బీఈడీ కాలేజీ వద్దకు వెళ్లారు. మధ్యాహ్నం రెండు గంటలకు పరీక్ష ప్రారంభం కావాల్సి ఉండగా.. పరీక్ష కేంద్రాన్ని ఫార్మసీ కాలేజీకి మార్చామని చావు కబురు చల్లగా చెప్పారు. దీంతో బీఈడీ కాలేజీ సిబ్బంది అభ్యర్థులను హడావుడిగా అక్కడికి పంపించారు. ఫార్మసీ కాలేజీలో అప్పుడప్పుడే ఓ సదస్సు ముగుస్తోంది. పరీక్షలు నిర్వహించడం సాధ్యం కాదని, పూలే భవంతిలోని సెమినార్ హాల్‌కు మార్చారు. దీంతో అభ్యర్థులు మరోమారు అక్కడికి పరుగులు తీయాల్సి వచ్చింది.

నచ్చినట్లు రాయించేందుకా..?

పరీక్షల నిర్వహణకు ముందుగానే ఏర్పాట్లు చేసుకుంటారు. అభ్యర్థుల సంఖ్యకు అనుగుణంగా స్థానాలను కేటాయిస్తారు. మౌలిక సదుపాయాలు కల్పిస్తారు. కానీ వర్సిటీ అధికారుల నిర్వాకం కారణంగా గందరగోళం ఏర్పడింది. సెంటర్‌లో హాల్ టిక్కెట్ నంబర్లు కూడా వేయలేకపోయారు. పరీక్ష జరిగిన గదిలో వందల కుర్చీలు ఉన్నాయి. పరీక్షకు హాజరైంది 25 మంది మాత్రమే. గదిలో మొదటి రెండు వరుసలను వదిలేసి.. చివరి సీట్లలో వారిని కూర్చోబెట్టారు. ఉన్నఫలంగా పరీక్ష కేంద్రాన్ని మార్చడం వెనుక కొందరి స్వలాభం ఉందనే ప్రచారం జరుగుతోంది. పరీక్ష కేంద్రంలో సీసీ కెమెరాల నిఘా ఉండాలి. మొదట నిర్ణయించిన కేంద్రంలో ఆ సౌకర్యం ఉంది. కానీ పూలే భవన్‌లో సీసీ కెమెరాల నిఘా లేదు. తమకు నచ్చినట్లు పరీక్షలు నిర్వహించేందుకే ఇలా చేశారనే ఆరోపణలు వస్తున్నాయి. కానీ ఇద్దరు బాలింతల వినతి మేరకు పరీక్ష కేంద్రాన్ని మార్చామని రిజిస్ట్రార్ రమేష్‌బాబు అన్నారు. ఆ ఇద్దరు అభ్యర్థులు శుక్రవారం ఉదయం వీసీని కలిశారని, పరీక్ష కేంద్ర దూరంగా ఉందని, దగ్గరలో ఏర్పాటు చేయాలని విన్నవించారని తెలిపారు. అందకే బీఈడీ కాలేజీ నుంచి ఫార్మసీ కళాశాలకు మార్చామని, ఆ తరువాత పూలే భవన్‌లో నిర్వహించామని అన్నారు.

క్విజ్ పోటీలకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): వికసిత్ భారత్-2047 క్విజ్ పోటీలకు యువత దరఖాస్తు చేసుకోవాలని జిల్లా యువజన సంక్షేమశాఖ అధికారి రవిశంకర్ తెలిపారు. జనవరి 12 స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న యువత అక్టోబరు 1 నుంచి 15లోపు మై భారత్ ఆన్‌లైన్ పోర్టల్‌లో తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. 15-29 సంవత్సరాల మధ్య వయస్సు గల యువతీ, యువకులు అర్హులన్నారు. 12 భాషల్లో మల్టిపుల్ చాయిస్‌లో క్విజ్ పోటీలు ఉంటాయన్నారు. వివరాలకు సెల్ నంబరు 9849913062ను సంప్రదించాలని కోరారు. క్విజ్ పోటీలకు పేర్లను mybharat.gov.in/pages/vbyld వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలన్నారు.

ఎంపీపీ సునీతకు పదవీ గండం

అవిశ్వాసం దిశగా వైసీపీ ఎంపీటీసీల అడుగులు

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): బుక్కరాయసముద్రం ఎంపీపీ దాసరి సునీతపై అవిశ్వాస తీర్మానానికి రంగం సిద్ధమైంది. వైసీపీకి చెందిన 13 మంది ఎంపీటీసీలు జడ్పీ డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్యను శుక్రవారం కలిసి తమ నిర్ణయాన్ని లిఖితపూర్వకంగా తెలియజేశారు. ఆయన పరిశీలించి, నిర్దేశిత ఫార్మాట్‌లో ఆర్డీఓకు పత్రాన్ని ఇవ్వాలని సూచించారు. అక్కడి నుంచి కలెక్టర్‌కు పంపుతారని, కలెక్టర్ ఆదేశాల మేరకు తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. దీంతో ఆర్డీఓను శనివారం కలిసి ఎన్నికల నియమావళి ప్రకారం అవిశ్వాస తీర్మాన పత్రాన్ని ఇవ్వాలని నిర్ణయించారు. ఎంపీపీ స్థానం నుంచి దాసరి సునీతను తప్పించి, కాలువ వెంకటలక్ష్మిని ఎన్నుకోవాలని వారు భావిస్తున్నారు. ఎంపీపీ ఎన్నిక సమయంలో సునీత, వెంకటలక్ష్మి చెరీ రెండున్నరేళ్ల పదవిని చేపట్టేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. కానీ సునీత పదవిని వదులుకోవడానికి సిద్ధంగా లేకపోవడంతో సమస్య తలెత్తింది. ఆమెను దించేసేందుకు పలువురు ఎంపీటీసీలు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. నిబంధనల ప్రకారం నాలుగేళ్ల పదవీకాలం తరువాతే అవిశ్వాసం ప్రవేశపెట్టే అవకాశం ఉంది. ఈ లోగా ప్రభుత్వం మారడం, దాసరి సునీత టీడీపీలో చేరడంతో వైసీపీకి షాక్ తగిలింది. ఆమెను పదవి నుంచి దించేయాలని నిర్ణయించుకున్నారు. నాలుగేళ్ల పదవీకాలం శుక్రవారంతో ముగియడంతో అవిశ్వాసం దిశగా చర్యలు ప్రారంభించారు. బుక్కరాయసముద్రంలో 19 మంది ఎంపీటీలు ఉన్నారు. వీరిలో 13 మంది వైసీపీ, ఐదుగురు టీడీపీవారు ఉన్నారు. వైసీపీవారు మూకుమ్మడిగా వ్యతిరేకిస్తుండటం, టీడీపీ సభ్యులు సైతం సునీతపై అసంతృప్తితో ఉండటంతో అవిశ్వాసం పెడితే గట్టెక్కడం కష్టంగానే కనిపిస్తోంది. అధికారుల నిర్ణయంపై ఆమె భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. వైసీపీ ఎంపీటీసీలు తనను కలిశారని, నిబంధనల మేరకు ఆర్డీఓను కలవాలని సూచించానని డిప్యూటీ సీఈఓ తెలిపారు. ఆయనను కలిసి వారిలో వైసీపీ ఎంపీటీసీలు రాజేశ్వరి, సుజాత, పెద్దనాగప్ప, భాస్కర్ రెడ్డి, కుళ్లాయప్ప, నాగయ్య, శ్రీజ, రాజారెడ్డి, రామచంద్రారెడ్డి తదితరులు ఉన్నారు.

చోరీ కేసుల్లో ముగ్గురి అరెస్టు

● బంగారం, వెండి, కేబుల్ స్వాధీనం



అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

పెనుకొండ టౌన్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): పలు చోరీ కేసుల్లో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. అందుకు సంబంధించిన వివరాలను స్థానిక డీఎస్పీ కార్యాలయంలో ఎస్పీ సతీష్‌కుమార్ శుక్రవారం వెల్లడించారు. మడకశిర మండలం యల్లోటి గ్రామానికి చెందిన విజయ్‌కుమార్, బోయ నరేష్, పెనుకొండ మండలం మరువపల్లికి చెందిన నరసింహుల మధ్య పరిచయం ఏర్పడింది. ముగ్గురూ కలిసి చోరీలు చేయాలనుకున్నారు. అందులో భాగంగా గత 11 నెలల్లో పెనుకొండ, రొద్దంలో ఆరు ఇళ్లలో చోరీలు చేశారు. బంగారు, వెండి ఆభరణాలను అపహరించారు. పొలాల్లో సైతం కేబుల్‌ను అపహరించారు. వీటిపై కేసులు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అందులో భాగంగా పుట్టపర్తి క్రాస్ వద్దనున్న అభయాంజనేయస్వామి ఆలయ సమీపాన స్కూటీలో పారిపోతున్న నిందితులను వెంబడించి, పట్టుకున్నారు. వారి నుంచి రూ.15.30 లక్షల విలువచేసే సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఇందులో 13.2 గ్రాముల బంగారు ఆభరణాలు, 12.8 గ్రాముల వెండి, 770 మీటర్ల కేబుల్, స్కూటీ స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. కేసును ఛేదించడంలో ప్రతిభ కనబరచిన ఎస్ఐ వెంకటేశ్వర్లు, సిబ్బందిని అభినందించారు. సమావేశంలో డీఎస్పీ నర్సింగప్ప, సీఐ రాఘవన్ పాల్గొన్నారు.

అత్యాచారం కేసులో జైలు శిక్ష

రొళ్ల, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): అత్యాచారం కేసులో మండలంలోని రంగనపల్లికి చెందిన సిద్ధరాజుకు ఏడేళ్ల జైలు శిక్ష పడింది. రూ.5వేల జరిమానా కూడా విధిస్తూ అనంతపురం జిల్లా 4క్లాస్ అదనపు న్యాయాధికారి తీర్పు వెలువరించారు. కోర్టు కానిస్టేబుల్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సిద్ధరాజు అలియాస్ సిద్దయ్యను 2018లో అత్యాచారం కేసులో పోలీసులు అరెస్టు చేశారు. కోర్టులో హాజరుపరిచారు. ఈ కేసులో వాదోపవాదాలు విన్న న్యాయాధికారి.. సిద్ధరాజును ముద్దాయిగా ప్రకటిస్తూ తీర్పు వెలువరించారు.

సంపులో పడి చిన్నారి మృతి

పరిగి, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఆడుకుంటూ వెళ్లిన మూడేళ్ల బాలుడు ధోని.. నీటి సంపులో పడి మృతిచెందాడు. ఈ విషాద సంఘటన పరిగి మండల పరిధిలోని ఊటకూరులో శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఈశ్వర్, శిల్ప దంపతుల కుమారుడు ధోని... మధ్యాహ్నం 2గంటల సమయంలో ఇంటి వద్ద ఆడుకుంటూ వెళ్లి నీటి సంపులో పడ్డాడు. కుటుంబ సభ్యులు ఆలస్యంగా గమనించారు. వెలికితీసేలోగా మృతిచెందాడు.

చీనీ టన్ను రూ.18 వేలు

అనంతపురం రూరల్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం సీజనల్ చీనీ కాయలు టన్ను గరిష్ఠంగా రూ.18వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఇన్‌చార్జి కార్యదర్శి, మార్కెటింగ్ శాఖ ఏడీ రాఘవేంద్రకుమార్ తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.10వేలు, సరాసరి ధర రూ.13వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 328టన్నుల చీనీ కాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.

వైద్యంలో నిర్లక్ష్యం.. పసివారి బలి

ఉరవకొండలో బాలుడు.. అనంతలో నవజాత శిశువు

ఆస్పత్రుల వద్ద బాధిత కుటుంబాల ఆందోళన



ఉరవకొండ సీహెచ్‌సీ వద్ద బాలుడి మృతదేహంతో ఆందోళన చేస్తున్న తల్లిదండ్రులు

అనంతపురం క్రైం/వైద్యం, ఉరవకొండ, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఒకే రోజు ఇద్దరు పసివారు ఆస్పత్రుల్లో ప్రాణాలను పోగొట్టుకున్నారు. అనంతపురంలోని నవజాత శిశువు, ఉరవకొండ సీహెచ్‌సీలో ఐదేళ్ల బాలుడు శుక్రవారం మృతిచెందారు. దీంతో బాధిత కుటుంబాలవారు ఆందోళనకు దిగారు.

● వజ్రకరూరు మండలం చాబాల గ్రామానికి చెందిన రాజేష్, సవిత దంపతుల కుమారుడు అహరున్ కుమార్(5)కు జ్వరం రావడంతో గురువారం రాత్రి 11 గంటలకు ఉరవకొండ సీహెచ్‌సీకి తీసుకొచ్చారు. వైద్యుడు ఇస్మాయిల్ ఆస్పత్రి ఆవరణలోనే ఉన్నా.. బాలుడిని చూసేందుకు రాలేదు. సెలైన్ పెట్టాలని నర్సులకు సూచించాడు. బాలుడికి వారు సెలైన్ బాటిల్ ఎక్కించారు. తర్వాత ఎవరూ పట్టించుకోలేదు. అర్ధరాత్రి సమయంలో బాలుడు తీవ్ర అస్వస్థతకు లోనయ్యాడు. నర్సు దగ్గరకు వెళ్లి తల్లిదండ్రులు ప్రాధేయపడినా పట్టించుకోలేదు. దీంతో బాలుడు తెల్లవారుజామున మృతిచెందాడు. ఈ విషయాన్ని కూడా కుటుంబ సభ్యులే గుర్తించారు. కోపోద్రిక్తులై.. వైద్యుడు, సిబ్బందిని నిలదీశారు. తమ కుమారుడి మృతికి డాక్టర్ల నిర్లక్ష్యమే కారణమంటూ ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని, వారికి సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. తమ కుమారుడి మృతికి కారణమైన వారిపై కేసు నమోదు చేయాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న డీసీహెచ్ఎస్ డేవిడ్ సెల్వరాజ్ విచారణ చేపట్టారు. విధుల్లో ఉన్న వైద్యుడు, నర్సులను వేర్వేరుగా విచారించారు. బాలుడి మృతిపై సమగ్ర విచారణ చేసి, నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని ఆయన తెలిపారు.

అనంతలో అమ్మ ఆస్పత్రిపై దాడి..



బిడ్డను పోగొట్టుకుని.. అమ్మ ఆస్పత్రిలో విషాదంలో బాలింత

వైద్యుల నిర్లక్ష్యం వల్లే పుట్టిన శిశువు మరణించాడంటూ తల్లిదండ్రులు, బంధువులు అనంతపురం నగరంలోని అమ్మ ఆస్పత్రిపై శుక్రవారం రాత్రి దాడి చేశారు. అద్దాలు, ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారు. త్రీటౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారించారు. నగరంలోని 5వ రోడ్డులోని హనుమాన్ కాలనీకి చెందిన చెందిన శిరీష ఈ నెల 20న అమ్మ ఆస్పత్రిలో మగ శిశువుకు జన్మనిచ్చారు. శిశువుకు ఊపిరితిత్తుల సమస్య వచ్చిందంటూ సాయినగర్‌లో ఉన్న హృదయ ఆస్పత్రికి తరలించారు. అక్కడ మూడు రోజులపాటు వైద్యం అందించారు. పరిస్థితి మెరుగవకపోవడం, డాక్టర్లు చేతులు ఎత్తేయడంతో ఈ నెల 24న ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించారు. అప్పటికే పరిస్థితి విషమించడంతో శుక్రవారం శిశువు మరణించాడు. వైద్యానికి రూ.4 లక్షల వరకూ ఖర్చు అయినా శిశువు మరణించడంతో బాధితుల కోపం కట్టలు తెంచుకుంది. వైద్యుల నిర్లక్ష్యం వల్లే ఇలా జరిగిందని కుటుంబ సభ్యులు, బంధువులు శుక్రవారం రాత్రి అమ్మ ఆస్పత్రి వద్దకు చేరుకుని, గొడవకు దిగారు. తాము చెప్పినట్లుగా ముందుగానే ఎందుకు సిజేరియన్ చేయలేదని, మీ నిర్లక్ష్యం వల్లే ఇదంతా జరిగిందని ఆస్పత్రి వర్గాలతో గొడవకు దిగారు. ఇరువర్గాల మధ్య వాగ్వాదం రేగి, దాడికి దారి తీసింది.

అమ్మాయిలు.. ఫుట్‌బాల్ చాంపియన్స్

రాష్ట్రస్థాయి టోర్నీ కైవసం.. బాలుర జట్టుకు తృతీయ స్థానం

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-19 ఫుట్‌బాల్ అనంత అమ్మాయిలు అదరగొట్టారు. చాంపియన్‌గా అవతరించారు. జిల్లా బాలుర జట్టు తృతీయ స్థానంలో నిలిచింది. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులో గురువారం నిర్వహించిన ఫైనల్లో అనంత బాలికల జట్టు 3-0 గోల్స్ తేడాతో విశాఖట్నంపై గెలుపొంది, టోర్నీని కైవసం చేసుకుంది. జిల్లా జట్టు, కోచ్‌లు మారుతిప్రసాద్, జయప్ప, దాదా ఖలందర్, సుశీలను డీవీఈఓ నారాయణ నాయక్, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, పీడీలు శకుంతల, లక్ష్మీనారాయణ, సుహాసిని అభినందించారు.



ట్రోఫీ అందుకుంటున్న జిల్లా బాలికల జట్టు

మచిలీపట్టణం ఎక్స్‌ప్రెస్ హిందూపురం వరకూ పొడిగింపు

గుంతకల్లు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని మచిలీపట్టణం ఎక్స్‌ప్రెస్‌ను తాత్కాలికంగా హిందూపురం వరకూ పొడగించినట్లు రైల్వే అధికారులు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం ధర్మవరం వరకూ వెళ్తున్న ఈ రైలును నవంబరు మూడో వారంలో హిందూపురం వరకూ గమ్యస్థానాన్ని పెంచనున్నట్లు తెలియజేశారు. మచిలీపట్టణం-హిందూపురం (17215) రైలును నవంబరు 20నుంచి 26వ తేదీ వరకూ నడపనున్నామన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 17216) నవంబరు 21నుంచి 27వతేదీ వరకూ హిందూపురం నుంచి బయలుదేరుతుందన్నారు. ఈ రైలు సత్యసాయి ప్రశాంతి నిలయం రైల్వే స్టేషన్‌లోనూ నిలుస్తుందన్నారు.

డీజీపీని కలిసిన ఎంపీ అంబికా

అనంతపురం క్రైం, సెప్టెంబరు26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తాను మంగళగిరిలోని డీజీపీ కార్యాలయంలో అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాకు సంబంధించి పలు విషయాలను డీజీపీ అడిగి తెలుసుకున్నట్లు ఎంపీ తెలిపారు.



డీజీపీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంపీ అంబికా

టమోటా కిలో రూ.18

అనంతపురం రూరల్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో శుక్రవారం టమోటాలు కిలో గరిష్ఠంగా రూ.18తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. అదేవిధంగా కనిష్ఠ ధర రూ.10వేలు, సరాసరి ధర రూ.14తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 2,550టన్నుల టమోటాలు వచ్చినట్లు పేర్కొన్నారు.

పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేలా చర్యలు: కలెక్టర్

అనంతపురం కలెక్టరేట్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు వచ్చే పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం 62వ జిల్లా పరిశ్రమలు, ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పారిశ్రామికరంగాన్ని ప్రోత్సహించేలా పారిశ్రామికవేత్తలను ఆహ్వానించి వారికి సకాలంలో సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా అన్ని రకాల అనుమతులను ఇవ్వాలన్నారు. తిమ్మసముద్రం, ఊరిచింతల, కూడేరు ప్రాంతాల్లో కొత్తగా ఏర్పాటు చేయనున్న ఎంఎస్ఎంఈ పారిశ్రామికవాడలను త్వరగా అభివృద్ధి చేయాలని ఏపీఐఐసీ జోనల్ మేనేజర్‌ను ఆదేశించారు. పీఎంఈజీపీ పథకం ద్వారా అర్హులైన వారి నుంచి నాణ్యత గల పథకాలను ఎంపిక చేయాలని పరిశ్రమల అధికారిని ఆదేశించారు. స్టాండప్ ఇండియా పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీ వర్గాల వారికి విరివిగా రుణాలు మంజూరు చేయించాలని ఎల్‌డీఎంను ఆదేశించారు. రాయదుర్గంకు చెందిన పారిశ్రామికవేత్తకు స్థల సేకరణ చేయాలని పరిశ్రమల అధికారిని ఆదేశించారు.

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన కల్పిస్తాం

జిల్లా కేంద్రం నుంచి గ్రామ స్థాయి వరకు జీఎస్టీ రేట్ల తగ్గింపు ప్రయోజనాలపై సామాన్య ప్రజలకు సైతం అవగాహన కల్పించేవిధంగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఆనంద్ తెలిపారు. రాష్ట్ర సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ జిల్లా కలెక్టర్లతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ ఆనంద్, పన్నుల శాఖ, జీఎస్టీ, ఏపీ ఎస్పీడీసీఎల్, నెడ్‌క్యాప్ శాఖల అధికారులు పాల్గొన్నారు. పలు అంశాలపై చర్చించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పీఎం కుసుం పథకానికి సంబంధించి 20 విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో 111మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ల పనులను పూర్తి చేయటానికి అవసరమైన చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఆయా సమావేశాల్లో జిల్లా పరిశ్రమల శాఖ అధికారి శ్రీనివాస్ యాదవ్, అసిస్టెంట్ డైరెక్టర్ రాజశేఖర్‌రెడ్డి, రవాణా శాఖ అధికారి వీర్రాజు, జెడ్ఎం దేవకాంతమ్మ, ఎల్‌డీఎం నరేష్‌రెడ్డి, పన్నుల శాఖ డిప్యూటీ కమిషనర్ భాస్కర్‌వల్లి, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ శేషాద్రి, నెడ్ క్యాప్ అశోక్‌రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ సురేంద్రరెడ్డి పాల్గొన్నారు.



వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్

పోషకాహారంతోనే ఆరోగ్యం: ఎస్కేయూ వీసీ


మాట్లాడుతున్న వీసీ అనిత

అనంతపురం రూరల్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ పోషకాహారం తీసుకోవాలని, అప్పుడే ఆరోగ్యవంతమైన జీవనం సాగించవచ్చని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ అనిత తెలిపారు. వర్సిటీలోని పూలే భవన్‌లో శుక్రవారం మహిళ అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో బాలిక ఆరోగ్యం -పోషకాహారం పై అవగాహన సదస్సును నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా వీసీ అనిత, ఐసీడీఎస్ అధికారి శ్రీదేవి, ప్రభుత్వ ఆస్పత్రి వైద్యురాలు హేమలత హాజరయ్యారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. మహిళలు ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. ముఖ్యంగా బాలికలు పోషకాహార లోపంతో ఆరోగ్యపరమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఈనేపథ్యంలో పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం కన్వీనర్ శోభలత తదితరులు పాల్గొన్నారు.

1585.85 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): జిల్లాకు నర్మదా కంపెనీకి చెందిన 1585.85 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా అయినట్లు అనంతపురం ఏడీఏ అల్తాఫ్ అలీఖాన్ పేర్కొన్నారు. స్థానిక ప్రసన్నాయపల్లి రైల్వే స్టేషన్ వద్ద వ్యాగిన్లలో వచ్చిన యూరియా బస్తాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. జేసీ ఆదేశాల మేరకు ఏపీ మార్క్‌ఫెడ్‌కు 1020, ప్రైవేటు డీలర్లకు 565.85 మెట్రిక్ టన్నుల యూరియాను సరఫరా చేయనున్నట్లు చెప్పారు.

ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి


దోబీఘాట్‌లో ఐలమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): నగరంలోని హెచ్చెల్సీ కాలనీ దోబీ ఘాట్‌లో శుక్రవారం వీరవనిత చాకలి ఐలమ్మ 130వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి రాష్ట్ర రజక కార్పొరేషన్ డైరెక్టర్ ఎన్‌సీ పరమేష్ పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. వరంగల్లు జిల్లా చిట్యాలలో నిరుపేద రజక కుటుంబంలో జన్మించిన ఐలమ్మ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి నిజాం నవాబులను, దొరలను ఎదిరించి పోరాడిన ధీర వనిత అని కొనియాడారు కార్యక్రమంలో రజక సంఘం నాయకులు ఆర్‌పీఎస్ఎస్ శ్రీరాములు, పద్మావతి, కృష్ణమూర్తి, శోభ, సుబ్రమణ్యం, ఎర్రిస్వామి, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

●అనంతపురంవిద్య: నగరంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో చాకలిఐలమ్మ జయంతిని ఆ పార్టీ నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు చాకలి లింగమయ్య, హరిక్రిష్ణ, రమణయ్య, అల్లీపీరా, కృష్ణుడు, నాగప్ప, రఘు, గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పరిషత్‌లో సంబరాలు

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ పాలకవర్గం కొలువుతీరి శుక్రవారంతో 4 ఏళ్లు పూర్తి కావడంతో స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం చైర్‌పర్సన్ గిరిజమ్మతో కలిసి పలువురు జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, కార్యాలయ సిబ్బంది సంబరాలు చేసుకున్నారు. జడ్పీ చైర్‌పర్సన్ చాంబర్‌లో కేక్‌కట్ చేశారు. అనంతరం డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో చైర్‌పర్సన్‌ను శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ.. జడ్పీ కార్యాలయ అధికారులు, సిబ్బంది సహకారంతోనే ఈ నాలుగు ఏళ్లు విజయవంతంగా పాలన సాగించగలిగామని తెలిపారు. సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులు, ఏఓ భాస్కర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా మహాసభలను విజయవంతం చేయండి

అనంతపురం టౌన్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 27, 28వ తేదీల్లో సాయినగర్ ఆపిల్ గార్డెన్స్‌లో సీఐటీయూ జిల్లా 11వ మహాసభలు జరగనున్నాయని, విజయవంతం చేయాలని ఆ యూనియన్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నాగమణి, నాగేంద్రకుమార్ శుక్రవారం సంయుక్త ప్రకటనలో పిలుపునిచ్చారు. మహాసభల్లో భాగంగా శనివారం ఉదయం 11 గంటలకు ఆర్ట్స్ కళాశాల నుంచి నగరపాలకసంస్థ కార్యాలయం వరకు కార్మిక ర్యాలీ చేపట్టనున్నట్లు చెప్పారు. సభలకు సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు, రాష్ట్ర కార్యదర్శి ముజఫర్ అహ్మద్, ఉపాధ్యక్షుడు ఓబులు హాజరుకానున్నట్లు తెలిపారు. అన్నివర్గాల కార్మికులు తరలిరావాలని కోరారు.

మండల సర్వసభ్య సమావేశం

రాప్తాడు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ జయలక్ష్మి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఇందులో మండల అధికారులు వారి శాఖల్లో చేపడుతున్న అభివృద్ధి పనులు తెలియజేశారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ ఊరూరా అభివృద్ధి పనులు వేగవంతంగా చేయాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయలక్ష్మి, వైస్ ఎంపీపీ వరలక్ష్మి, ఎంపీటీసీ సభ్యుడు జాఫర్, సర్పంచులు శీనయ్య, నరేష్, మండలస్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

చెత్త సేకరణపై శిక్షణ

నార్పల, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): బొందలవాడ గ్రామ పంచాయతీలో శుక్రవారం ఆరు మండలాల నుంచి వచ్చిన కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్లకు చెత్తసేకరణ, తడి చెత్త, పొడి చెత్త వేరువేరు చేయడంపై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ తాడిపత్రి, పెద్దపప్పూరు,యల్లనూరు, సింగనమల, నార్పల మండలాల నుంచి 70 మంది సీఆర్పీలకు తడి, పొడి చెత్తను వేరు చేసే విధానాన్ని ప్రత్యేకంగా చూపించామన్నారు. డిప్యూటీ ఎంపీడీఓ శైలజారాణి, రిసోర్స్ పర్సన్లు రంగారెడ్డి, షాకీర్ తదితరులు పాల్గొన్నారు.

నార్పలలో పట్టుబడిన దొంగలు

నార్పల, సెప్టెంబరు26(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కూతలేరు బ్రిడ్జి వద్ద శుక్రవారం ఇద్దరు మహిళలు చోరీకి పాల్పడుతూ పట్టుబడ్డారు. ఒంగోలుకు చెందిన ఇద్దరు మహిళా దొంగలు నార్పలలో ఒక మహిళ పర్సును చోరీ చేయడానికి ప్రయత్నించారు. గమనించిన ఆమె గట్టిగా కేకలు వేయడంలో స్థానికులు చుట్టుముట్టారు. ఆ ఇద్దరు మహిళా దొంగల్లో ఒకామె దూల్‌పేట కాలనీవైపు పరారయ్యారు. స్థానికులు వెంటపడి ఆమెను పట్టుకొచ్చారు. ఇద్దరు మహిళలకు దేహశుద్ధి చేసి, పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనపై విచారణ చేస్తున్నట్లు సీఐ కౌలుట్లయ్య తెలిపారు.

రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య

చెన్నేకొత్తపల్లి, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపం చెంది మండల కేంద్రంలో రైలు కింద పడి గురువారం రాత్రి యువకుడు విజయ్‌కుమార్(25) ఆత్మహత్య చేసుకున్నాడు. హిందూపురం రైల్వే హెడ్‌కానిస్టేబుల్ ఎర్రిస్వామి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కంబదూరు మండలం తిప్పేపల్లికి చెందిన విజయ్‌కుమార్ ఎక్స్‌కవేటర్ కొనుగోలు చేసి, నిర్వహిస్తుండేవాడు. నెలవారీ కంతులు సక్రమంగా చెల్లించలేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతుండేవాడు. ఈ నేపథ్యంలో మనస్తాపం చెంది రైలు కింద పడి చనిపోయాడు. రైల్వే పైలెట్ విషయాన్ని హిందూపురం రైల్వే పోలీసులకు తెలిపారు. హెడ్‌కానిస్టేబుల్ ఎర్రిస్వామి ఘటనా స్థలానికి చేరుకుని, సెల్‌ఫోన్ ఆధారంగా విజయ్‌కుమార్ కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పెనుకొండ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

మహాలక్ష్మీ.. నమోస్తుతే..

● నవరాత్రుల్లో ఐదోరోజున వివిధ అలంకరణలలో అమ్మవార్ల దర్శనం



అనంతపురం టౌన్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఐదవ రోజున శుక్రవారం నగరంలోని ఆలయా ల్లో అమ్మవారు వివిధ రూపాల్లో దర్శనమిచ్చారు. అధికంగా మహాలక్ష్మి అలంకరణలో పూజలందుకున్నారు. వేకువజామునే అర్చకులు అమ్మవార్ల మూలవిరాట్‌లను అలంకరించి పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి దర్శనం చేసుకుని మొక్కులు చెల్లించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. పలు ఆలయాల వద్ద కళాకారులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టి అలరించారు.


పాతూరు అమ్మవారి శాలలో కోలాటమాడుతున్న కళాకారులు

రాప్తాడు నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించండి

● పలువురు మంత్రులను కోరిన ఎమ్మెల్యే పరిటాల సునీత

అనంతపురం, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): రాప్తాడు నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే పరిటాల సునీత పలువురు మంత్రులను కోరారు. ఈ మేరకు శుక్రవారం అసెంబ్లీ సమావేశాల అనంతరం ఆమె దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. బోగినేపల్లి గ్రామంలో అసంపూర్తిగా ఉన్న లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయానికి రూ. 66 లక్షల నిధులు మంజూరు చేసిన నేపథ్యంలో రాప్తాడు మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్‌నాయుడు, గ్రామ ప్రజలతో కలిసి పరిటాల సునీత మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ రాప్తాడు మండల కేంద్రం సమీపంలో అసంపూర్తిగా నిర్మాణంలో ఉన్న పండమేరు వెంకటరమణస్వామి ఆలయానికి రూ.కోటి నిధులు మంజూరు చేయాలని కోరారు. తర్వాత డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, కేంద్ర మంత్రి పెమ్మసాని, జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడును కలవాలని ప్రయత్నించగా... వారు అందుబాటులో లేరు. దీంతో ఆమె పలు సమస్యలకు సంబంధించి నిధుల కేటాయింపు వివరాలతో కూడిన వినతి పత్రాలను వారి కార్యాలయాల్లో అందజేశారు.


మంత్రి ఆనం రామనారాయణరెడ్డితో మాట్లాడుతున్న పరిటాల సునీత, రాప్తాడు నియోజకవర్గ ప్రజలు

విద్యార్థులు లక్ష్య సాధనకు కృషి చేయాలి

● కలెక్టర్ ఆనంద్ సూచన
● పీవీకేకే ఇంజనీరింగ్ కాలేజీలో ఫ్రెషర్స్ డే

అనంతపురం రూరల్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఇంజనీరింగ్‌తో పాటు సివిల్ సర్వీసెస్, యూపీఎస్సీ వంటి అత్యున్నత లక్ష్యాలను ఎంచుకుని వాటిని సాధించే దిశగా కృషి చేయాలని కలెక్టర్ ఆనంద్ సూచించారు. నగర సమీపంలోని ఆలమూరురోడ్డులోగల పీవీకేకే ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం ఫ్రెషర్స్‌డే వేడుకలు ఉత్సాహంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా కలెక్టర్ హాజరై మాట్లాడారు. విద్యార్థులు చదువులో నే కాకుండా క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమా లు, సేవాకార్యక్రమాల్లో కూడా ముందుండాలన్నారు. ఏం కోర్సు చదివాం, ఏ సబ్జెక్టు ఎంచుకున్నాం అనేదాని కన్నా.. మనం ఎంత కష్టపడ్డాం, ఎలాంటి లక్ష్యాలను చేరుకున్నాం, స మాజానికి ఎలాంటి సేవా చేశామనేవే ముఖ్యమన్నారు. ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని సాధించడానికి కృషి చేయాలని అన్నారు. అనంతరం కళాశాల చైర్మన్ పల్లె కిశోర్ తదితరులు కలెక్టర్‌ను శాలువా, పుష్పగుచ్ఛంతో సన్మానించారు. తర్వాత పలువురు విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించి అలరించారు. ప్రిన్సిపాల్ బండి రమేష్‌బాబు, కేరళ మాజీ డీజీపీ శంకర్ రెడ్డి, కళాశాల యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్‌రెడ్డి, డీన్ సంతోష్‌కుమార్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ దీప్తి జోర్దానా, ఏఓ మనోహర్‌రెడ్డి, డిప్లమో కళాశాల ప్రిన్సిపాల్ వైభవ్, బాలాజీ ఎంబీఏ కళాశాల ప్రిన్సిపాల్ సుబ్బారావు పాల్గొన్నారు.


కలెక్టర్‌ను సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

జగన్ సైకో కాబట్టే 11 సీట్లు కట్టబెట్టారు: గౌస్ మొద్దీన్

అనంతపురం క్రైం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం వైఎస్ జగన్‌ను ఆయన సొంత చెల్లి షర్మిలనే సైకో అన్నారని, ప్రజలు కూడా అది గుర్తించి 11 సీట్లు కట్టబెట్టారని టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గౌస్ మొద్దీన్ న్నారు. జిల్లాకేంద్రంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నందమూరి బాలకృష్ణపై వైసీపీ నాయకులు చేసిన వ్యాఖ్యలపై మండిపడ్డారు. వైసీపీ నాయకుల మాటలు రాష్ట్ర ప్రజలు నమ్మేస్థితిలో లేరన్నారు. ఏపీలో సైకో అని ఎవరిని అడిగినా.....జగన్ పేరే చెప్తారని తెలిపారు. ఏపీని మూడు ముక్కలు చేసి పాలించిన సైకో జగన్‌రెడ్డి అంటూ దుయ్యబట్టారు. అసెంబ్లీ సాక్షిగా ఎన్టీఆర్ కుమార్తె నారా భువనేశ్వరిపై వైసీపీ నాయకులు జిగుప్సాకరంగా మాట్లాడినపుడు మీనోళ్లు ఏమయ్యాయంటూ ప్రశ్నించారు. జగన్, ఆయన పార్టీ నాయకులు సైకోలు కాబట్టే రాష్ట్ర ప్రజలు వాళ్లను 11 సీట్లకే పరిమితం చేశారంటూ మండిపడ్డారు. బాలకృష్ణపై నోటికొచ్చినట్టు మాట్లాడితే..సహించేది లేదన్నారు. నందమూరి బాలకృష్ణ అభిమానులు ఓర్పును పరీక్షించవద్దని ఆయన వైసీపీ నాయకులకు హెచ్చరించారు.


మాట్లాడుతున్న గౌస్ మొద్దీన్

రైతులందరికీ యూరియా అందజేయాలి

● రైతు సంఘం డిమాండ్

గార్లదిన్నె, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన రైతులందరికీ యూరియా అందజేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు చెన్నప్ప యాదవ్ డిమాండ్ చేశారు. మండలకేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పంటల సాగుచేసిన రైతులు యూరియా కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైతులందరికీ యూరియా సరఫరా చేస్తామని ప్రభుత్వం గొప్పలు చెబుతోందే తప్ప పూర్తి స్థాయిలో సరఫరా చేయాలేదని ఆరోపించారు. యూరియా కోసం రాష్ట్ర వ్యాప్తంగా రైతులు అనే అవస్థలు పడుతున్నారన్నారు. ఇప్పటి కైనా అధికారులు, నాయకులు స్పందించి యూరియా కొరత లేకుండా సరఫరా చేయాలని కోరారు. లేని పక్షంలో రైతులతో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా నాయకుడు శ్రీనినాథ్ చౌదరి, సీపీఐ మండల కార్యదర్శి రాముడు, సహాయ కార్యదర్శి వన్నూరుస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యువల్‌పై తీర్మానం చేయాలి

అనంతపురం ప్రెస్‌క్లబ్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ మంత్రులు, ఎమ్మెల్యేలు ఆర్డీటీ ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యువల్‌పై అసెంబ్లీలో తీర్మానం చేయాలని ఆర్డీటీ పరిరక్షణ కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో కమిటీ కన్వీనర్ సాకే హరి, సీపీఎం జిల్లా కార్యదర్శి ఓ. నల్లప్ప, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కేశవరెడ్డి, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కేపీ నారాయణస్వామి తదితరలు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే క్రైస్తవుల సంక్షేమం

అనంతపురం రూరల్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): క్రైస్తవ, మైనార్టీల సమక్షేమం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని టీడీపీ క్రిస్టియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఈటె స్వామిదాసు అన్నారు. మండలంలోని కురుగుంట గ్రేస్ కల్వరి చర్చి ఆవరణలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు, ఈసందర్భంగా మాట్లాడుతూ.. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉంటేనే అన్నివర్గాల ప్రజలు బాగుపడతారన్నారు. క్రైస్తవుల సంక్షేమం, అభివృద్ధికోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారని పేర్కొన్నారు.

ఎమ్మెల్యే స్పందన పట్ల హర్షం

అనంతపురం రూరల్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): బేడ బుడగ జంగాల సమస్యలపై ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ స్పందించి సీఎం చంద్రబాబుకు లేఖ రాయడం పట్ల బుడగజంగాల సంఘం జిల్లా కార్యదర్శి సిరిశాల అంజి శుక్రవారం ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. బేడ బుడగ జంగాలను ఎస్సీ జాబితాలో చేర్చాలని సీఎం అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేసి ఫైలు కేంద్రానికి పంపించారని, అయితే ఈ విషయం ముందుకు సాగకపోవడంతో సమస్యను ఇటీవల ఎమ్మెల్యే దగ్గుపాటికి వివరించామన్నారు. దీంతో ఎమ్మెల్యే స్పందించి సమస్యల పరిష్కారానికి వెంట నే సీఎంకు లేఖ రాయడం సంతోషంగా ఉందని అన్నారు.

పోస్టర్ల విడుదల

అనంతపురం వైద్యం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఉరుముల కళాకారుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక పథకాలు రూపొందించాలని ఏపీ మాల మహానాడు నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు రోడ్లు, భవనాల అతిథిగృహంలో శుక్రవారం అధ్యక్షుడు ఓబులేసు, నాయకులు శ్రీనివాసులు, రాము పోస్టర్లు విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ ఈనెల 28 మాల మహానాడు నూతన కార్యవర్గ సమావేశం రేడియో స్టేషన్‌వద్దనున్న ఎస్వీఆర్(పోలీస్ చెన్నప్ప) పక్షన్‌హాల్లో జరగనుందని, ఇందుకు జాతీయ అధ్యక్షుడు చెంగయ్య, అ శోక్‌కుమార్ ముఖ్య అతిథులుగా వస్తారని, పెద్దసంఖ్యలో మాలలు తరలిరావాలని వా రు కోరారు.

బాధ్యతలు చేపట్టిన అమర్నాథ్

అనంతపురం ప్రెస్‌క్లబ్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా తపాలాశాఖ సూపరింటెండెంట్‌గా అమర్నాథ్ బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు శుక్రవారం తన చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. కడప జిల్లా రాయచోటి సబ్ డివిజన్ పరిధిలో ఇన్స్‌పెక్టర్ ఆఫ్ పోస్టాఫీస్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయన జిల్లా సూపరింటెండెంట్‌గా ఉద్యోగోన్నతిపై వచ్చారు.

పోరాటాలతోనే హక్కుల సాధన: ఎస్టీయూ

అనంతపురం విద్య, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పోరాటాలతోనే హక్కుల సాధించవచ్చని, అందుకు ప్రతిఒక్కరు కదలాలని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఘునాథరెడ్డి పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని ఉపాధ్యాయభవన్‌లో శుక్రవారం ఎస్టీయూ జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఇందులో గురుపూజోత్సవం రోజున ఉత్తమ అవార్డులు పొందిన టీచర్లను సత్కరించారు. ఈ కార్యక్రమాలకు రఘునాథరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గత వైసీపీ సర్కారు మన పట్ల ఎలా వ్యవహరించిందో ఇప్పుడు కూటమి సర్కారు అలాగే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదన్నారు. దీన్ని నిరసి స్తూ అక్టోబరు7వ తేదీన విజయవాడలో ఫ్యాప్టో ఆధ్వర్యంలో వేలాదిమందితో మహాధర్నా నిర్వహిస్తున్నామన్నారు. ఉమ్మడి అనంత జిల్లా నుంచి భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో ఎస్టీయూ కార్యాలయానికి సొంతభవనం ఏర్పాటుకు అందరూ భాగస్వాములు కావాలని కోరారు. సమావేశంలో జిల్లాఅధ్యక్షుడు రమణారెడ్డి, జిల్లా ప్రధాప కార్యదర్శి రామాంజినేయులు, నాయకులు పాల్గొన్నారు.

పిల్లలకు సంస్కృతీ సంప్రదాయాలను నేర్పించాలి

● మాజీ మేయర్ స్వరూప

అనంతపురం టౌన్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): అనాదిగా వస్తున్న మన సంస్కృతీ సాంప్రదాయాలను పిల్లలకు చిన్నప్పటినుంచే నేర్పించాలని నగరపాలకసంస్థ మాజీ మేయర్ స్వరూప సూచించారు. నగరంలోని సోమనాథ్‌నగర్‌లోగల శివశక్తిసాయి ఆలయంలో శుక్రవారం సాయి ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన కుమారిపూజకు స్వరూపతో పాటు ప్రస్తుత డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య హాజరయ్యారు. తొలుత వారు విజయదుర్గమ్మ, ఎల్లమ్మ దేవతలకు పూజలు నిర్వహించారు. అనంతరం ఏడాది నుంచి పదేళ్ల లోపు వయసున్న బాలికలకు కాళ్లకు పసుపు పారాణి పెట్టి, సంప్రదాయ రీతిలో తాంబూలాలు అందించి, వారిని అమ్మవారిగా భావించి హారతులు పట్టి పూజలు చేశారు. అనంతరం స్వరూప మాట్లాడుతూ... సృష్టికి మూల స్త్రీ అని, ఆ స్త్రీని దేవతగా భావించి పూజించడం అనాదిగా వస్తున్న ఆచారమని పేర్కొన్నారు. నవరాత్రుల్లో అమ్మవారిని పూజించడంతోపాటు మహిళలను, చిన్నారులను పూజించేలా సాయి ట్రస్టు చేపట్టడం అభినందనీయమన్నారు. ట్రస్టు అధ్యక్షుడు విజయసాయికుమార్, ఆలయ ధర్మకర్త శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.


చిన్నారులకు హారతి ఇస్తున్న స్వరూప, వాసంతి సాహిత్య

కలెక్టర్‌ను కలిసిన బీజేపీ నాయకులు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): బీజేపీ నాయకులు.. కలెక్టర్ ఆనంద్‌ను కలిశారు. స్థానిక కలెక్టరేట్‌లో శుక్రవారం వారు ఆయన్న మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరం జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్, రాష్ట్ర కార్యదర్శి సందిరెడ్డి శ్రీనివాసులు, రాష్ట్ర సెల్స్ కన్వీనర్ చిరంజీవిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్ రెడ్డి, యువమోర్చా నాయకులు చక్రధర్‌యాదవ్, అజేష్.. కలెక్టర్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

మోస్తరు వర్షం

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం వర్షం పడింది. విడపనకల్లులో ఓ మోస్తరు వర్షంకురిసింది. అనంతపురం, కూడేరు, తాడిపత్రి, యాడికి, నార్పల, గుత్తి తదితర మండలాల్లో చిరుజల్లులు పడ్డాయి. అలాగే గురువారం రాత్రి కుందుర్పి, బ్రహ్మసముద్రం, రాయదుర్గం, పామిడి, గుమ్మఘట్ట మండలాల్లో చిరుజల్లులు పడ్డాయి.

'బాలకృష్ణ నోరు అదుపులో పెట్టుకోవాలి'

అనంతపురం కలెక్టరేట్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): బాలకృష్ణ నోరు అదుపులో పెట్టుకోవాలని వైసీపీ యువజన, విద్యార్థి విభాగ నాయకులు హితవు పలికారు. మాజీ సీఎం జగన్‌పై అసెంబ్లీ వేదికగా హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలకు నిరసిస్తూ నగరంలోని జడ్పీ కార్యాలయం ఎదురుగా ఉన్న అంబేడ్కర్ విగ్రహం ఎదుట శుక్రవారం వారు ఆందోళన చేశారు. బాలకృష్ణకు మంచి బుద్ధి ప్రసాదించాలని అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. తక్షణం బాలకృష్ణ క్షమాపణ చెప్పాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస దత్త, ఉదయ్‌కుమార్, చంద్రశేఖర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఎంహెచ్ఓగా నరసింహులు బాధ్యతలు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): అనంత నగరపాలక సంస్థ మున్సిపల్ హెల్త్ ఆఫీసర్‌గా నరసింహులును నియమిస్తూ కమిషనర్ బాలస్వామి ఉత్తర్వులు జారీ చేశారు. ఏఎంసీలో డీఈగా ఉన్న నరసింహులు శుక్రవారం కమిషనర్ బాలస్వామిని మర్యాదపూర్వకంగా కలిసిన అనంతరం ఇంచార్జి ఎంహెచ్ఓగా బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు ఎంహెచ్ఓగా ఉన్న రంగస్వామి మైదుకూరు మున్సిపల్ కమిషనర్‌గా బదిలీపై వెళ్లారు. దీంతో డీఈ నరసింహులుకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


బెస్త రామకృష్ణ (ఫైల్)

శింగనమల,సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): నాయపల్లి క్రాస్ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ బెస్త రామకృష్ణ(58) చికిత్స పొందుతూ మృతి చెందాడు వివరాలు ఇలా ఉన్నాయి. నార్పల మండలం నడిమిదొడ్డి గ్రామానికి చెందిన బెస్త రామకృష్ణ గత శుక్రవారం నాయనపల్లి క్రాస్ నుంచి నడిమిదొడ్డికి బైక్‌లో వెళుతుండగా కారు ఢీ కొంది. ప్రమాదంలో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే చికిత్స కోసం అనంతపురం ఆసుపత్రికు తరలించారు. పరిస్థితి విషమంగా ఉడడంతో బెంగుళూరుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పశ్చిమ బెంగాల్ వాసి..

రాప్తాడు: మండలంలోని హంపాపురం సబ్‌స్టేషన్‌లో సమీపాన 11 కేవి విద్యుత్ తీగలు మరమ్మత్తులు చేస్తూ ఈనెల 20న తీవ్రంగా గాయపడిన పచ్చిమ బెంగాల్ వాసి బైసి (30) చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈయన ఓ కాంట్రాక్టర్ వద్ద విద్యుత్ మరమ్మతు పనులు నిర్వహిస్తున్నాడు. ఈ నెల 20న హంపాపురం సమీపంలో విద్యుత్ స్తంభంపై మరమ్మతు పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్ తగిలి తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం హైదరాబాదులోని ఓ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పచ్చిమ బెంగాల్‌లోని బైసి గ్రామానికి తరలించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

గుండెపోటులో టీడీపీ గ్రామకమిటీ ఉపాధ్యక్షుడు..


రాం గోపాల్(ఫైల్)

రాప్తాడు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని బండమీదపల్లి టీడీపీ గ్రామ కమిటీ ఉపాధ్యక్షుడు, వరిమడుగు నివాసి అలివిగొండ రాంగోపాల్ (34) శుక్రవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందాడు. రాంగోపాల్ అనంతపురం రాంనగర్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ప్రైవేటు రైటర్‌గా పని చేసుకుంటూ జీవనం సాగించేవాడు. శుక్రవారం ఉదయం వరిమడుగు గ్రామంలో ఇంట్లో ఉన్నప్పుడు గుండెపోటు రావడంతో కుప్పకూలి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమార్తె కలరు. టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి దగ్గుపాటి శ్రీనివాసులు, ఇతర టీడీపీ నాయకులు ఆయన మృతదేహం వద్ద నివాళులర్పించారు.

దివ్యాంగురాలి ఆత్మహత్య


లక్ష్మీదేవి (ఫైల్)

శింగనమల, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెస్టునరసాపురంలో దివ్యాంగురాలు ఆత్మహత్య చేసుకుంది. గ్రామానికి చెందిన కరుబ నాగరాజు భార్య లక్ష్మీదేవి (38) పోలియో దివ్యాంగురాలు. ఇంటి వద్దనే చిన్నపాటి అంగడి పెట్టుకుంది. భర్త వ్యవసాయ పనులు చేస్తుండేవాడు. అయితే ఆమె గత ఐదేళ్లుగా తీవ్ర వెన్నునొప్పితో బాధపడుతోంది. పలు ఆస్పత్రిల్లో చికిత్స చేయించినా నయం కాలేదు. ఈ క్రమంలో నొప్పి అధికం కావడంతో భరించలేక శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పరుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. కొద్దిసేపటికి గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ఆమె చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతురాలికు కూమార్తె, కూమారుడు ఉన్నారు. భర్త ఫిర్యాదు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

డ్వామా పథకాల అమలుపై ఆరా


డ్వామా అధికారులతో మాట్లాడుతున్న అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రాహార్

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : డ్వామా పథకాల అమలుపై అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రాహార్ ఆరా తీశారు. శిక్షణలో భాగంగా శుక్రవారం స్థానిక డ్వామా పీడీ కార్యాలయానికి అసిస్టెంట్ కలెక్టర్ వచ్చారు. డ్వామా పీడీ సలీం బాషా, వాటర్ షెడ్ ఏపీడీ సుధాకర్‌రెడ్డి, డ్వామా పరిపాలన అధికారి రామకృష్ణ, విజిలెన్స్ అధికారి శ్రీనివాసులు, ఫైనాన్స్ మేనేజర్ రాధ, కెపాసిటీ బిల్డింగ్ ఏపీడీ విజయ్‌కుమార్, ఇతర విభాగాల అధికారులతో అసిస్టెంట్ కలెక్టర్ సమావేశమయ్యారు. ఉపాధి హామీ పథకం అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. ఉపాధి నిధులతో చేపట్టే పనుల పురోగతిపై ఆరా తీశారు. విభాగాల వారిగా పథకాల అమలు తీరును సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.

న్యూస్ బాక్స్

ముందస్తు దసరా వేడుకలు


కేక్ కట్ చేస్తున్న మున్సిపల్ చైర్మన్

తాడిపత్రి, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ముందస్తు దసరా వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి చిత్రపటాలకు మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి పూజలు నిర్వహించారు. తాడిపత్రి మున్సిపాలిటీ రాష్ట్రంలోనే మొదటి స్థానంలో రావడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం భారీఎత్తున కేక్‌ను కట్‌చేశారు.

ఆరోహణరావు.. అధిరోహించేనా..?

● తాడిపత్రి నూతన సీఐకు సవాళ్లు ● శాంతిభద్రతలు.. అసాంఘిక కార్యకలాపాలను అదుపు చేసేరా..?



తాడిపత్రి పోలీస్‌స్టేషన్, సీఐగా బాధ్యతలు చేపట్టనున్న ఆరోహణరావు

తాడిపత్రి, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): రాజకీయకక్షలు, కార్పణ్యాలు, అసాంఘిక కార్యకలాపాలైన మట్కా, పేకాట, గంజాయికి తాడిపత్రి కేరాఫ్ అడ్రస్‌గా ఉంటోంది. ఈ ప్రాంతంలో రాజకీయంగా ఏ చిన్న సంఘటన జరిగినా రాష్ట్రంలోనే సంచలనంగా మారుతోంది. అలాంటి తాడిపత్రికి పోలీసు అధికారులు రావాలంటేనే జంకుతున్నారు. గతంలో ఇక్కడ పనిచేసిన సీఐలు పని ఒత్తిడి, రాజకీయ ఒత్తిళ్లు తట్టుకోలేక కొందరు బదిలీపై వెళ్లగా.. మరికొందరు దీర్ఘకాలిక సెలవులో వెళ్లారు. సమస్యాత్మకమైన ఈ పట్టణానికి ప్రస్తుతం 20 రోజుల నుంచి ఎస్ఐలు, సీఐలు లేకపోవడం గమనార్హం. ప్రస్తుతం చిత్తూరు జిల్లా సైబర్‌క్రైంలో పనిచేస్తున్న ఆరోహణరావు తాడిపత్రికి సీఐ బదిలీపై త్వరలో వస్తున్నారు. ఆయనకు ఇక్కడి రాజకీయ చదరంగంలో ఇరుపార్టీల నాయకులను సర్దిచెప్పగలరా... చాపకిందనీరులా విస్తరిస్తున్న గంజాయి, మట్కా, పేకాట తదితర వాటిని నియంత్రించగలరా.. శాంతిభద్రతలను కాపాడే సామర్థ్యం ఉందా... అని ప్రజలు చర్చించుకుంటున్నారు.

సచివాలయాల తనిఖీ

శెట్టూరు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నంపల్లి, యాటకల్లు గ్రామ సచివాలయాలను ఎంపీడీఓ జిలానీ బాషా శుక్రవారం తనిఖీచేశారు. సిబ్బంది విధులను నిర్లక్ష్యం చేస్తే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అంగన్‌వాడీ కేంద్రం..

● గుత్తి: స్థానిక 11వ అంగన్‌వాడీ కేంద్రాన్ని మున్సిపల్ కమిషనర్ జబ్బర్‌మీయా శుక్రవారం తనిఖీ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్ జయలక్ష్మి, ఏఈలు గోవిందప్ప, హరికిరణ్ ఉన్నారు.

రిజర్వాయర్‌కు ఇన్‌ఫ్లో 2,411 క్యూసెక్కులు

బెళుగుప్ప, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు ఇన్‌ఫ్లో 2,411 క్యూసెక్కులు, ఔట్‌ఫ్లో 2,371 క్యూసెక్కులు ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు శుక్రవారం వెల్లడించారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 1.708 టీఎంసీల నీటి నిల్వ ఉందని, ఇక్కడి నుంచి ఫేజ్-2కు 1,904 క్యూసెక్కుల నీరు వెళ్తోందని తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ ఎల్ఓసీ అందజేత



రాయదుర్గం, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన చాకలి పవిత్ర బోన్ మారో క్యాన్సర్‌తో బాధ పడుతోంది. ఆమెకు శస్త్రచికిత్స కోసం ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.2.50 లక్షల విలువైన ఎల్ఓసీ పత్రాన్ని మంజూరు చేసింది. ఆ పత్రాన్ని బాధితురాలికి విప్ కాలవ శ్రీనివాసులు తనయుడు కాలవ భరత్ శుక్రవారం అందజేశారు.

'బీజేపీలో కార్యకర్తగా కొనసాగుతా'

గుంతకల్లు టౌన్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): తాను ఊపిరి ఉన్నంతవరకు బీజేపీలో కార్యకర్తగా కొనసాగుతాను అని బీజేవైఎం జిల్లా మాజీ అధ్యక్షుడు మంజుల వెంకటేష్ పేర్కొన్నారు. స్థానిక పాతగుంతకల్లులో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తనకు, తన మిత్రులకు బీజేపీకి ఎటువంటి సంబంధమూ లేదని, భవిష్యతులో ఉండబోదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్ స్పష్టం చేశారన్నారు. అయితే జరిగిన సంఘటనపై షోకాజ్ నోటీస్ ఇచ్చి తనను వివరణ కోరకుండా.. ఏకపక్షంగా ఇలా నిర్ణయం తీసుకోవడం బాధాకరమని అన్నారు. ఈ విషయాన్ని పార్టీ పెద్దల దృష్టికి తీసుకెళ్తానన్నారు. సమావేశంలో కేశవ, చక్రపాణి, రవీంద్ర పాల్గొన్నారు.

కార్మికులకు దుస్తుల పంపిణీ

పామిడి, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లోని 15 మంది పారిశుధ్య కార్మికులకు స్థానికులు సద్దల రామాంజనేయులు, సద్దల గోవర్ధన్ సుమారు రూ. 10 వేల విలువ చేసే దుస్తులను ఇచ్చారు. వాటిని సీహెచ్‌సీ వైద్యాధికారి శివకార్తీక్‌రెడ్డి ఆ కార్మికులకు శుక్రవారం అందజేశారు.

ప్రకృతి సాగుపై అవగాహన

తాడిపత్రి, సెప్టెంబరు26(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో శనగపంట ఏగ్రేడ్ మోడల్ ఏడాది పొడవునా సాగు చేసే విధానంపై జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ లక్ష్మణ్ నాయక్, నరేంద్ర అవగాహన కల్పించారు. మండలంలోని రావివెంకటాంపల్లి గ్రామంలోని నారాయణస్వామి పొలంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో ఎలా పంటను దిగుబడి సాధించుకోవాలో వివరించారు.

మార్కెట్ యార్డుకు మొండి బకాయిలు

ప్రభుత్వ సంస్థల నుంచి రాలని అద్దెలు


గుంతకల్లు మార్కెట్ యార్డు

గుంతకల్లు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): స్థానిక మార్కెట్ యార్డుకు ప్రభుత్వ సంస్థల నుంచి రావాల్సిన అద్దెలు మొండి బకాయిలుగా మారాయి. గుంతకల్లు మార్కెట్ యార్డుకు చెందిన గోడౌన్లు, ఖాళీ స్థలాన్ని ప్రభుత్వ శాఖలకు అద్దెకు ఇచ్చారు. ప్రైవేటు వ్యక్తులకు, సంస్థలకు కేటాయించిన షాపులు, గోడౌన్లకు అద్దెలు సక్రమంగా వసూలవుతుండగా, ప్రభుత్వ సంస్థలు ట్రాన్స్‌కో, సివిల్ సప్లయ్, ఏపీ హౌసింగ్ శాఖల నుంచి దాదాపు రూ.50 లక్షలు బకాయిలు ఏర్పడ్డాయి.

● ట్రాన్స్‌కో: మార్కెట్ యార్డులో ఖాళీ స్థలం ఉండటంతో విద్యుత్ శాఖ సబ్ స్టేషన్‌ను ఏర్పాటుచేయడం కోసం 2007లో లీజుకు స్థలాన్ని తీసుకుంది. స్థలానికి రూ.12 వేల అద్దె చెల్లించేలా అగ్రిమెంటు చేసుకున్నారు. 2022లో ఖాళీ స్థల విస్తీర్ణాన్ని అనుసరించి నిబంధనలను అనుసరించి రూ.1.05 లక్షలుగా అద్దెను మార్కెట్ కమిటీ సవరించింది. అంత మొత్తం ఇవ్వలేమని చెప్పిన విద్యుత్ శాఖ డబ్బు చెల్లించడం నిలిపివేసింది. అప్పటి నుంచి ఇప్పటిదాకా రూ. 43.92 లక్షల అద్దె బకాయి ఏర్పడింది.

● సివిల్ సప్లయ్ : మార్కెట్ యార్డులో సివిల్ సప్లయ్ రేషన్ నిల్వ చేయడం కోసం ఆ శాఖ మార్కెట్ యార్డులో గోడౌన్లను అద్దెకు తీసుకుంది. కాగా అగ్రిమెంటు పూర్తయిందని పేర్కొంటూ మార్కెట్ కమిటీ అధికారులు అద్దెను పెంచగా, తమ నిబంధనల ప్రకారం అంత చెల్లించలేమని, పాత అద్దెనే చెల్లిస్తూ వస్తున్నారు. కొత్త అగ్రిమెంటు చేసుకోలేదు. దీంతో మార్కెట్ కమిటీ లెక్కల ప్రకారం సివిల్ సప్లయ్ శాఖ నుంచి రూ.2.42 లక్షల అద్దె బకాయి ఏర్పడింది.

● ఏపీ హౌసింగ్: హౌసింగ్ శాఖ మార్కెట్ యార్డులో సిమెంటు నిల్వ ఉంచడానికి ఓ గోడౌనును అద్దెకు తీసుకుంది. దానికి సంబంధించి రూ. 3.81 లక్షల అద్దె బకాయి ఉంది.

బకాయిలు చెల్లించాలి



పెద్ద మొత్తంలో అద్దె బకాయిలు ఉన్నందున మార్కెట్ యార్డుకు ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. యార్డుకు వచ్చే ఆదాయం ఏమూలకూ సరిపోవడంలేదు. జీతాలకే సరిపోతోంది. అభివృద్ధి కార్యక్రమం ఏదైనా చేపట్టాలన్నా, రైతులకు ఏవైనా సౌకర్యాలు కల్పించాలన్నా డబ్బు సమస్య వేధిస్తోంది.

- లక్ష్మిదేవి, మార్కెట్ యార్డు చైర్‌పర్సన్

విద్యుత్‌శాఖనే బాకీ పెడితే ఎలా



వినియోగదారులు కరెంటు బకాయిలు పెడితే విద్యుత్ శాఖ ఇలాగే ఓర్చుకుంటుందా..? ముక్కుపిండి మరీ వసూలు చేస్తుంది కదా. అలాంటప్పుడు మార్కెట్ యార్డులో అద్దెకు స్థలం తీసుకుని మూడేళ్లుగా అద్దె చెల్లించకపోతే ఎలా..? దాదాపు రూ. 44 లక్షలు ఇవ్వనందున మార్కెట్ యార్డుకు సమస్యగా మారింది.

- రాణా ప్రతాప్, యార్డు వైస్ చైర్మన్

కలెక్టరుకు విన్నవించాం



పెద్ద మొత్తంలో ఉన్న విద్యుత్ శాఖ బకాయి విషయంగా నోటీసును జారీ చేశాం. సమస్యను కలెక్టరు, మార్కెటింగ్ శాఖ కమిషనర్‌కు దృష్టికి తీసుకెళ్లాం. త్వరలో సమస్య పరిష్కారం అవుతుందని భావిస్తున్నాం. బకాయిలు వసూలైతే మార్కెట్ యార్డులో అభివృద్ధి కార్యక్రమాలకు ఉపయోగకరంగా ఉంటుంది.

- బాలాజీరావు, మార్కెట్‌యార్డు కార్యదర్శి

ఇది పెద్దాసుపత్రి దారి..!


బురదమయంగా ఉన్న ఆస్పత్రి దారి

విడపనకల్లు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఓ చిన్నపాటి వాన వచ్చినా.. స్థానిక పెద్దాసుపత్రికి వెళ్లే దారి ఇలా తయారవుతోంది. మట్టిరోడ్డు కావడంతో మొత్తం బురదమయంగా మారుతోంది. రోడ్డు మొత్తం ఎగుడు దిగుడుగా.. గుంతలతో నిండి ఉండటంతో ద్విచక్రవాహనదారులు అనేక సార్లు కింద పడి.. అదే ఆస్పత్రిలో చేరుతున్నారు. కనీసం నడిచి వెళ్లడానికి కూడా వీలు లేని విధంగా ఉంది. ఈ రోడ్డుపై రోగులను తీసుకొని వెళ్లడానికి స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితిని రోజూ అధికారులు, ప్రజాప్రతినిధులు చూస్తున్నా.. పట్టించుకోకపోవడంపై వారు దుమ్మెత్తి పోస్తూ పోతున్నారు. ఇక్కడ సీసీ రోడ్డు వేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ద్విచక్రవాహనాల వేలం

ఉరవకొండ,సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో మూడు ద్విచక్ర వాహనాలను శుక్రవారం వేలం వేయగా.. రూ.15,800 ఆదాయం వచ్చినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ రేవతి తెలిపారు. అలాగే వివిధ కేసుల్లో పట్టుబడిన నాటుసారా, మద్యంను ధ్వంసం చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ అధికారులు శ్రీరాములు, శ్రీలత సీఐ రవిచంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు అక్కాచెల్లెలు


వర్షిత, ఇంద్రలేఖ

గుంతకల్లు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని నక్కనదొడ్డి పంచాయతీ నరసాపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుకొంటున్న అక్కాచెల్లెలు ఇంద్రలేఖ, వర్షిత రాష్ట్రస్థాయి పరుగు పోటీలకు ఎంపికయ్యారు. అనంతపురంలో ఈ నెల 17న నిర్వహించిన జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో వీరు పాల్గొన్నారు. చెల్లెలు వర్షిత అండర్ 16 విభాగంలో 60 మీటర్ల పరుగు పోటీల్లో మొదటి స్థానం, 600 మీటర్ల పరుగు పోటీల్లో రెండో స్థానాన్ని సాధించారు. అక్క ఇంద్రలేఖ అండర్ 16 విభాగంలో 60 మీటర్ల పరుగు పోటీల్లో రెండో స్థానంలో నిలిచారు. ఈ ఇద్దరూ ఈ నెల 26 నుంచి 29 వరకూ విజయవాడలో నిర్వహించే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారు.

పగిలిన పైపులైన్.. నీరు వృథా

45 రోజులైనా పట్టించుకోని కాంట్రాక్టర్లు, అధికారులు


పైపులైన్ నుంచి వస్తున్న తాగునీరు

కూడేరు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలో విద్యుత్ లైన్ పనులు చేస్తుండగా బ్రహ్మణపల్లి గ్రామానికి సరఫరా అయ్యే తాగునీటి పైపులైన్‌ను దాదాపు 45 రోజుల క్రితం పగిలింది. దీంతో నీరంతా వృథా అవుతుండటంతో ఆ గ్రామంలో తాగునీటి సమస్య నెలకొంది. మోటార్‌ను ఆన్ చేసిన వెంటనే పైపుల ద్వారా నీరు వృథాగా పోతోందని, మోటార్‌ను ఆఫ్ చేసినప్పుడు తిరిగి ఆ నీరు కలుషితమై పైపుల్లోకి వెళ్తోందని ఆ గ్రామస్థులు తెలిపారు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని మండిపడుతున్నారు.

వైసీపీకి అధికారుల అండ!

● మీటర్ లేకుండానే వాటర్ ప్లాంట్ నిర్వహణ
● ఐదేళ్లపాటు పట్టించుకోని విద్యుత్ అధికారులు
● టీడీపీ మద్దతుదారులకు ప్లాంట్ అప్పగింతతో మీటర్ బిగించిన వైనం
● నష్టం వస్తోందని ప్లాంట్ మూసివేత
● ఇబ్బందుల్లో శ్రీధరఘట్ట గ్రామస్థులు

బొమ్మనహాళ్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీధరఘట్టలో వాటర్ ప్లాంట్‌ను టీడీపీ ప్రభుత్వం 2018లో ఏర్పాటు చేసింది. కొద్ది నెలలకే వైసీపీ అధికారంలోకి రావడంతో దాని నిర్వహణ బాధ్యతలు వైసీపీ మద్దతుదారులు తీసుకున్నారు. శ్రీధరఘట్టకు వైసీపీ మద్దతుదారుడే సర్పంచ్‌గా ఉన్నారు. మరి అధికారుల నిర్లక్ష్యమో.. లేక కొందరి అధికారులు చేతివాటమో తెలీదుగాని.. ఇంత కాలం ఆ ప్లాంట్‌కు విద్యుత్‌శాఖ అధికారులు మీటర్ బిగించలేదు. త్వరలో సర్పంచ్ పదవీ కాలం ముగియబోతున్న తరుణంలో ఆ ప్లాంట్ నిర్వహణ బాధ్యతలను టీడీపీ మద్దతుదారులకు నెల క్రితం అప్పగించారు. ఇన్నాళ్లూ పట్టించుకోని విద్యుత్ అధికారులకు అకస్మాత్తుగా నియమాలు గుర్తొచ్చాయి. వెంటనే వారు ప్లాంట్‌కు విద్యుత్ మీటర్ బిగించారు. బిల్లు భారీగా రావడంతో తమకు నష్టం వస్తుందని టీడీపీ మద్దతుదారులు రెండు రోజుల క్రితం ఆ ప్లాంట్‌ను మూసివేశారు. దీంతో శుద్ధ నీరు దొరక్క ఆ గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి వాటర్ ప్లాంట్ తెరిపించేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.


మూసివేసిన వాటర్ ప్లాంట్

చర్యలు తీసుకుంటాం: లక్ష్మిరెడ్డి, విద్యుత్ ఏఈ, బొమ్మనహాళ్

ఇన్నేళ్లూ ఈ ప్లాంట్‌కు విద్యుత్ మీటరే లేదనే విషయం మాకు తెలీదు. ఇంతకాలం మీటర్ లేకుండా విద్యుత్ వాడారనే విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటాం.

విచారిస్తాం: దాస్, డిప్యూటీ ఎంపీడీఓ, బొమ్మనహాళ్

వాటర్ ప్లాంట్‌కు విద్యుత్ మీటర్ ఉండాల్సిందే. ఇంత కాలం విద్యుత్ మీటర్ ఎందుకు పెట్టలేదో విచారిస్తాం. విద్యుత్ బిల్లు చెల్లించే బాధ్య త ప్లాంట్ నిర్వాహకుడిదే. ప్లాంట్ తెరిపించేలా చర్యలు తీసుకుంటాం.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

పెద్దవడుగూరు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిట్టూరుకు చెందిన అనిల్‌కుమార్ (24) అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ.. గురువారం అర్ధరాత్రి మరణించాడు. మద్యానికి బానిస కావడంతో తల్లి పెద్దక్క బుధవారం రాత్రి మందలించింది. క్షణికావేశంలో ఇంటి నుంచి వెళ్లి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. బంధువులు గుర్తించి అతన్ని అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించాడు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

బెళుగుప్ప, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని నక్కలపల్లికి చెందిన సుజాత శుక్రవారం పులుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించారు. కుటుంబ సభ్యులతో గొడవపడి క్షణికావేశంతో ఈ అఘాయిత్యానికి పాల్పడ్డారు. కుటుంబ సభ్యులు ఆమెను వెంటనే బెళుగుప్ప ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ఆరోగ్యపరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

పరిహారం అందక రైతులు విలవిల


మాట్లాడుతున్న బాధిత రైతులు

బొమ్మనహాళ్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని దర్గాహొన్నూరు గ్రామానికి చెందిన సుమారు 50 మంది రైతులు ఓ విత్తనాల కంపెనీ నుంచి పంట పరిహారం అందక ఇబ్బందులు పడుతున్నారు. 2024 లో ఈ రైతులు కణేకల్లు క్రాస్‌కు చెందిన ఓ ఫర్టిలైజర్ షాప్ నిర్వాహకుడు, ఏజెం ట్ హరినాథ్ దగ్గర ఓ కంపెనీకి చెందిన మొక్కజొన్న విత్తనాలను కొనుగోలు చేసి దాదాపు 100 ఎకరాల్లో సాగు చేశారు. ఆశించిన పంట రాక రైతులు తీవ్రంగా నష్టపోవడంతో వారు వారు ఏజెంట్‌ను నిలదీశారు. దీంతో గత ఏడాదే ఆ కంపెనీ ప్రతినిధులు పంటను పరిశీలించి.. నష్ట పరిహారం ఇచ్చేలా ఒప్పందం చేసుకున్నారు. మొదట అరకొర పరిహారం ఇచ్చి... మిగతా డబ్బు త్వరలో ఇస్తా అని మాటిచ్చి చేతులు దులుపుకున్నారు. పలుమార్లు ఏజెంట్‌ను అడిగినా ఫలితం లేకపోవడంతో.. రైతులు మోహనందప్ప, శివగంగమ్మ, సంతోష్ శుక్రవారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయడానికి వచ్చారు. తమకు రూ.2.70 లక్షలు రావాల్సి ఉందని, ఇంకా గ్రామంలో అనేకమందికి పరిహారం అందలేదని వారు పోయారు. పోలీసులు స్పందించి తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

కంబదూరుకు తిరుపతి రైలు..!


కంబదూరు స్టేషన్‌లో ఉన్న రైలు

కళ్యాణదుర్గం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కంబదూరు మండలంలోని కదిరిదేవరపల్లి రైల్వే స్టేషన్ వరకు నడుస్తున్న తిరుపతి-కదిరిదేవరపల్లి ప్యాసింజర్ రైలును కంబదూరు మీదుగా దొడ్డహళ్లి వరకు నడపాలనే ప్రతిపాదన ఉంది. ఇటీవల ఎమ్మెల్యే సురేంద్ర బాబు, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి సోమన్న దృష్టికి ఈ ప్రతిపాదనను తీసుకెళ్లారు. దీంతో రైల్వే సేఫ్టీ అధికారులు కదిరిదేవరపల్లి నుంచి దొడ్డహళ్లి వరకు దాదాపు 20 కిలోమీటర్లకుపైగా రైల్వే ట్రాక్‌ను రైలు ఇంజిన్ సాయంతో శుక్రవారం పరిశీలించారు. రైల్వే ట్రాక్ పనులు పూర్తయినప్పటికీ ఇప్పటివరకు కంబదూరుకు రైలు నడపడం లేదు. త్వరలోనే కంబదూరు వరకు రైలు వచ్చే అవకాశం ఉంది.

విద్యుత్ స్తంభాన్ని మార్చరూ..


పాఠశాల ఆవరణలో దెబ్బతిన్న విద్యుత్ స్తంభం

విడపనకల్లు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని గడేకల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో ఉన్న ఈ విద్యుత్ సిమెంట్ స్తంభం శిథిలావస్థకు చేరింది. మధ్యలో సిమెంట్ ఊడిపోవడంతో లోనవున్న కడ్డీలు వానలకు తుప్పుపట్టాయి. దీంతో స్తంభం ఓ వైపు ఒరిగింది. వందలాది మంది పిల్లలుండే చోట ఉన్న ఈ విద్యుత్ స్తంభాన్ని మార్చాలని అధికారులుకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవటం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు.